# తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది: జూలూరి గౌరీశంకర్



సభలో ప్రసంగిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: చిన్న పిల్లల మానసిక ఆరోగ్యానికి వారి మాతృభాషతో ఉండే అనుబంధానికి సంబంధం ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్ చెప్పారు. తెలుగు భాష గురించి ఎవరూ ఆందోళన చెందవలిసన అవసరం లేదని, తెలుగు భాష సజీవమ న్నారు. ఈ అచ్చమైన, కమ్మనైన అమ్మ భాష తెలుగును రక్షించుకోవడానికి ఎంచేయాలో ఆలోచించాలని ఆయన కవులు, రచయితలు, సాహితీ వేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ , పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం, సినీ పాటల పోటీలు, తెలుగు భాషా సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తొలుత జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుప్తా మాట్లాడుతూ తెలుగు భాష రక్షణకు ఎనలేని కృషి చేస్తున్న కవులు, రచయితలకు నా చేతులు మీదగా సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం భాషా పురస్కార గ్రహీతలు తాళ్లూరి మయూరి, డా.రాధాకుసుమ, నల్లతీగ శ్రీనివాసాచార్యులు, చిట్టిబాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కె.మురళీమోహన్‌రాజు వ్యవహరించారు.



హైదరాబాద్ వార్త

## తూనికలు కొలతల శాఖలో అరకొర సిబ్బంది

# మోసాలను అరికట్టేదెలా..?

**వ్యాపారసంస్థలు లక్షల్లో.. తనిఖీ సిబ్బంది 16మందే**

**నామమత్రపు తనిఖీలు.. స్వల్ప పెనాల్టీలతోనే సరి**

**అక్రమాలను పూర్తి స్థాయిలో నివారించలేకపోతున్న అధికారులు**

హైదారాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: సూపర్‌మార్కెట్లో గానీ, కిరాణదుకాణాల్లో గానీ సరుకులు కొనుగోలు చేస్తున్నారా.. తూకం సరిపోతుందని భావిస్తున్నారా.. చెల్లించే డబ్బులకు సరిపడా వచ్చాయని అనుకుంటున్నారా..అయితే మీరు పప్పులో కాలేసినట్లే.. ఎందుకైనా మంచిది మీరు కొన్న సరుకులను వేరే కాంటాలో వేసి తూకం సరిపోయిందా లేదా చూసుకోండి. నగరంలోచాలా దుకాణాలు సూపర్ మార్కెట్లలో చాలా చోట్ల తూకాల్లో వ్యత్యాసం వస్తుంది.వినియోగదారుడు చెల్లించే డబ్బుకు న్యాయం జరగడం లేదు. తూనికలు కొలతల్లో మోసం చేస్తూ వ్యాపారులు నిలువునా దోపిడీ చేస్తున్నారు. ధర విషయంలో రాజీ పడని వ్యాపారులు తూకంలో మాత్రం దగా చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేడు. తమకు జరుగుతున్న మోసాలను వినియోగదారుడు గుర్తించినా ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి.గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 3లక్షలకు పైగా వ్యాపారసంస్థలు ఉన్నాయి. కానీ తనిఖీలు చేసి అక్రమాలు నియంత్రించే అధికారమున్న తూనికలు కొలతలశాఖ సిబ్బంది ఉన్నది మాత్రం 16మందే.. వారుకూడా నామమాత్రపు తనిఖీలు, రికార్డుల్లో రాసుకునేందుకే కేసులన్నట్లుగా నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

**ఎలాక్ట్రానిక్ కాంటాల ట్యాంపరింగ్..** సాధారణ త్రాసులతో మోసం చేస్తారని, ఎలా క్ట్రానిక్ కాంటాలతో మోసం ఉండదని జనంలో అభిప్రాయం ఉంది. కానీ వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాంటాలను ట్యాంపరింగ్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. అసలు సాధారణ త్రాసుల కన్నా వీటితో మరింత సులువుగా మోసం చేసే అవకాశం ఉండటమే దీనికి కారణం. ఎలక్ట్రానిక్ కాంటాలు ఖాళీగా ఉన్నప్పుడు డిస్‌ప్లే సున్నా(0) బరువును చూపిస్తుంది. తర్వాత సరుకులు పెట్టి బరువు లెక్కిస్తారు. అయితే ఎలక్ట్రానిక్ కాంటాలపై ఉండే ఆప్షన్‌ను మార్చడం ద్వారా తక్కువ సరుకులు పెట్టినా ఎక్కువ బరువు డిస్‌ప్లేలో కనిపించేలా చేస్తున్నారు. ఉదాహరణకు కాంటాపై 20కిలోల సరుకు పెడితే 21.3కిలోలు ఉన్నట్లుగా చూపుతుంది. అదే ఆప్షన్ మార్చితే సక్రమంగా 20కిలోల బరువు చూపుతుంది.



**ఏది కొన్నా తక్కువ తూకమే..** మార్కెట్‌లో కిలో పండ్లు,కూరగాయలు మటన్,చికన్,చేపలు వంటివి ఏమీ కొన్నా 800-900 గ్రాములే ఉంటున్నాయి. వివిధ బ్రాండ్ల నూనె ప్యాకేట్లలో నిర్దేశించిన బరువు కంటే తక్కువగా నూనె ఉంటోంది. లీటర్ ప్యాకెట్లలో 50నుండి 100 గ్రాములు.. 5లీటర్ల బాటిళ్లలో 200 నుండి 400 గ్రాములవరకు తక్కువగా ఉంటుంది. పెట్రోల్ బంకుల్లో కొనుగోలు చేస్తున్న ప్రతి లీటర్ పెట్రోల్, డీజిల్ 50మిల్లీ లీటర్లనుండి 100 మిల్లీలీటర్లు తక్కువగా ఉంటుంది. రేషన్ దుకాణాల డీలర్ల చేతివాటమైతే మరీ ఎక్కువగా ఉంటోంది.

**మోసం ఎలా జరుగుతోంది..** సాధారణంగా ఎలక్ట్రానిక్ కాంటాలను సమతలంలో ఏర్పాటు చేయాలి. సమతలంగా లేకున్నా.. ఓవైపు ఎత్తుగా, మరో వైపు పల్లంగా ఉన్నా.. తప్పుడు తూకం చూపిస్తోంది. ఇది తెలియక కొందరు, మోసం చేసే ఉద్దేశ్యంతో మరికొందరు వ్యాపారులు కాంటను తప్పుగా అమర్చుతున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలపై నేరుగా తూచలేని సరుకులు వస్తువుల కోసం కాంటాపై ఏదైనా బుట్ట, పళ్ళెం వంటివి పెట్టి తూకం వేస్తారు. అలాంటప్పుడు కాంటాలో బరువును జీరో సెట్టింగ్‌కు మారుస్తారు. దీంతో బుట్ట,పళ్ళెం బరవు కూడా కలిసిపోయి సున్నాగా చూపిస్తుంది. అయితే తర్వాత ఇతర వస్తువులు తూచేటప్పుడు ఆబుట్ట,పళ్ళెం తీసేసినా..తిరిగి బరువు జీరో సెట్టింగ్‌కు మార్చడం లేదు. ఎలక్ట్రానిక్ కాంటాల్లో బరువు తూచే విధానాన్ని సవరించేందుకు మోడ్ ఆప్షన్ ఉంటుంది. దీనిని వ్యాపారులు దుర్వినియోగం చేసి..తప్పుడు తూకాలకు పాల్పడుతున్నారు. ఇక సాధారణ టేబుల్ త్రాస్‌లో తూకం రాళ్లు, సరుకులు పెట్టే ప్లేట్ల కింద ఉండే సెట్టింగ్‌ను అటూ ఇటూ జరపడం ద్వారా తక్కువ తూకం వచ్చేలా చేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయలు మార్కెట్ల వంటి చోట్ల అడుగున కట్‌చేసిన తప్పుడు తూకం రాళ్లను వినియోగిస్తున్నారు.

## ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

**రాష్ట్ర అధ్యక్షుడుగా జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా సి.చంద్రశేఖర్**

**సంయుక్త కార్యదర్శులుగా చందులాల్ శ్రీవాస్తవ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లో జరిగిన ఈ ఎన్నికలకు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కె.కేశవరెడ్డి కేంద్ర పరిశీలకునిగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా సి.చంద్రశేఖర్, కోశాధికారిగా ఏ.గంగారెడ్డి (జిహెచ్ఎంసి), సహా అధ్యక్షుడుగా వి విశ్వనాధంలు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.సీతారామయ్య, గుండం మోహన్‌రెడ్డి (జిహెచ్ఎంసి), పి.ఆర్.మోహన్, పి.శ్రీహరిరెడ్డి, వి.భాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా పి.శ్యాంరావు (జిహెచ్ఎంసి), టి.ప్రభాకర్, ఎన్.విష్ణువర్థన్‌రెడ్డి, పి.శరత్‌బాబు, ఎ.బి.విజయలక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.బక్కారెడ్డి, ఎం.ఈశ్వరయ్య, రఘునాథరెడ్డి, పి.నాగేశ్వర్‌రావు, ఎ.లక్ష్మి నరసింహారావు (జిహెచ్ఎంసి)లను ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా చందులాల్ శ్రీవాస్తవ్, ఎం.రవీందర్‌రెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, పి.పెంటయ్య (జిహెచ్ఎంసి), పబ్లిసిటీ కార్యదర్శిగా బి.ప్రహ్లాద్‌రావు (జిహెచ్ఎంసి)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కె.కేశవరెడ్డి ప్రకటించారు. ఈ కార్యవర్గం పదవీకాలం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది.

## కుక్కలు పట్టుకున్నారు.. పక్క గల్లీలో వదిలేశారు

**ఇలా వచ్చారు.. అలా వెళ్లారు, జంతుప్రియులమంటూ బాధితులపై గొడవ**

**అదృష్టవశాత్తు కొడుకును కాపాడుకున్నాం**

**ప్రమాదం జరిగి రెండు రోజులు గడుస్తున్నా తొంగిచూడని అధికారులు**



గాయపడ్డ బాలుడు రిషి

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: కుక్కలను పట్టుకొని అరగంటలోనే పక్క గల్లీలో వదిలేశారు. కొత్తపేట డివిజన్ మారుతి నగర్‌లో రిషి(4) అనే బాలుడిపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ఈ సంఘటనకు సంబంధించి అధికారులకు ఫి ర్యాదు చేయగా కుక్కలు పట్టు కునేందుకు వచ్చినవారు రెండు కుక్కలను బుధవారం పట్టుకున్నారు. అయితే జంతు ప్రియుల మంటు కాలనీలోని కొందరు కుక్కలు పట్టుకున్న వారికి కొన్ని డబ్బులు ఇవ్వడంతో ఆ రెండు కుక్కలను పక్క గల్లీలో వదిలేసి చేతులు దులుపుకున్నారని బాధితుడు రిషి తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి, బాలు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడి జరిగినప్పుడు మేము వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం నుంచి మా కొడుకుని కాపాడుకోగలిగామని మరే మైనా జరిగుంటే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నా రు. తాము పనిచేస్తున్న అపార్ట్మెంట్ ఎదురుగా ఉన్నవారు ఇంట్లో పాచిపోయిన ఆహార పదార్థాలను వేయడంతో ఈ ప్రాంతంలో దజనులకొద్దీ కుక్కలు సంచరిస్తు న్నాయన్నారు. మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేస్తే బుధవారం వచ్చిన కుక్కలు పట్టుకునే సిబ్బంది తమ వద్ద ఫిర్యాదు కూడా తీసుకున్నారని కొద్దిసేపటికి పట్టుకున్న కుక్కలను వదిలి వేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పరిస్థితి ఇంత విషమంగా ఉన్నప్పటికీ తమ కాలనీలో కొందరు కావాలని ఆహార పదార్థాలు వేసి కుక్కలు గుంపులుగా చేరడానికి కారణం అవు తున్నారని తెలిపారు. మా కొడుకుపై కుక్కలు దాడి చేయడానికి ఆరు నెలల ముందు నుంచే ఆహార పదార్థాలు పెట్టవద్దని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండ ఆహారం కుక్కలకు పెడుతున్నారని, దీంతో గుంపులుగా చేరిన కుక్కలు మా కొడుకుపై దాడికి పాల్పడ్డాయని అన్నారు. బాలుడి ప్రాణాలు పోతే ఎవరు బాధ్యులని ఆహారం పెట్టే వారిని ప్రశ్నిస్తే మాపై దాడికి ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలపై ఉన్న ప్రేమ మనుషులపై లేదా అని ఇదేం నాగరికమని వారు విలపించారు. మా కొడుకుకు జరగరానిది ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని, అధికారులు కూడా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదృష్టవశాత్తు కొడుకుని ప్రమాదం నుంచి కాపాడుకోగలిగామన్నారు.

## రాజేంద్రనగర్ హైదర్‌గూడ ఎర్రబోడ కాలనీలో వీధి కుక్క బీభత్సం



కుక్కకాటు వల్ల గాయాల పాలైన పునీత, చేతన్ చిన్నారులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిని శునకం దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. పిచ్చి కుక్క ఆ బాలుడిని కింద పడేసి నెత్తిపై విచక్షణ రహితంగా గాయ పరిచింది.అదే బస్తీలో మరో బాలుడిని కూడ కుక్క కరిచింది.అడ్డంగా వచ్చిన మరో ముగ్గురిపై కుక్క కరిచి గాయ పరిచిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌గూడ ఎర్రబోడలో చోటు చేసుకుంది.ఈ సంఘటనలో కుక్క ఐదు మందిపై దాడి చేసినట్లు సమాచారం.ఎర్రబోడ కాలనీకి చెందిన చేతన్ (8) అనే బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో కుక్క కరిచింది.అదే వీధిలో ఆడు కుంటున్న పునీత్ (6) అనే బాటుడిని కూడ కరిచి గాయ పరిచింది. అడ్డంగా వచ్చిన మరో ముగ్గరిని కరుచుంటూ కుక్క పారి పోయింది.కుక్క దాడిలో గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.వరుసగా కుక్క ఐదు మందిపై దాడి చేయటం పట్ల ఎర్రబోడకు చెందిన ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప ్పటికైనా సరంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలు నుంచి కాపాడాలని కాలనీవాసులు కోరుకుంటున్నారు.

## పోస్ట్ కోవిడ్ తరువాత పెరుగుతున్న హిప్ సమస్యలు

**డాక్టర్ ఏ.వి.గురవారెడ్డి**

బేగంపేట ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : కోవిడ్ -19 ఇన్‌ఫెక్షన్ నుండి కోలుకున్న చాలా మంది రోగులు తుంటి (హిప్) సంబంధ సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని, డాక్టర్ ఏ.వి.గురవారెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తరువాత దీర్ఘకాలికంగా ఈ సమస్యలు పెరుగుతుండటం ఆందోళణ కల్గిస్తున్న అంశం అన్నారు. ఈ రోగులలో ఎ వి ఎన్ అనేది కోవిడ్ లేదా కోవిడ్ ఇన్‌ఫెక్షన్ చికిత్స సమయంలో స్టెరాయిడ్‌లు ఉపయోగిం చడం వల్ల ఈ సమస్యలు పెరుగుతున్నట్లు చెప్పవచ్చన్నారు.కోవిడ్ -19నుంచి కోలోకున్న 6-9నెలల తరువాత లక్షణాలు తరచుగా కనిపిస్తాయన్నారు.40నుంచి 50శాతం మందిలో ఈ సమస్యలు తలెత్తుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా తుంటి కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్సను అందించడం చాలా అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. కోవిడ్ -19తరువాత హార్ట్ ఎటాక్స్, కాళ్లలో బ్లడ్ క్లాట్స్, లంగ్ సమస్యలతో పాటు ఏ వాస్క్యులర్ నెక్రోసిస్ హిప్ జాయింట్ కు రక్త ప్రసరణ తగ్గిపోవడం జరుగుతుందన్నారు. ఈ సమస్యలు కోవిడ్ సమయంలో ఎక్కువగా స్టెరాయిడ్స్ వాడటం, కోవిడ్ వైరస్ వల్ల బ్లడ్ వేజల్స్‌లో రక్తం గడ్డ కట్టడం వల్ల రక్త సరఫరాలో ఇబ్బందులతో బ్రెయిన్ స్ట్రోక్ హార్ట్ ఎటాక్స్‌వస్తాయన్నారు. రక్తం నీళ్ల లాగా అయితే బ్లీడింగ్ ఎక్కువ అవుతుందని,కోవిడ్ వల్ల బ్లడ్ క్లాట్స్‌వల్ల హిప్ జాయింట్ దెబ్బతింటుంది. రక్త ప్రసరణ సరిగా లేక హిప్ జాయింట్ దెబ్బతింటుంది.మన దేశంలో ఏ వాస్క్యులర్ నెక్రోసిస్‌కు (హిప్ జాయింట్స్)కు ప్రధానంగా స్టెరాయిడ్స్ మందులు వాడకం, ఆల్కహాల్, ఏది కారణం లేకుండా వస్తుంటాయి. వారినికి పది కేసులు ఏ వాస్క్యులర్ నెక్రోసిస్ చూస్తున్నామని,కోవిడ్ సమయంలో ప్రాణాలు కాపాడుకునేందుకు స్టెరాయిడ్ మందుల వాడకం తప్పని సరి అని, స్టెరాయిడ్స్ వాడిన అందరికీ వస్తుందా,ఎవరికి వస్తుందన్నది స్పష్టంగా తెలియద న్నారు. ఈ సమస్యలకు ప్రస్తుతం చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు.రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించడం ద్వారా హిప్ జాయింట్లో కప్పు బంతి కూర్చోబెట్టే విధానం ఖచ్చితంగా ఉంటుందన్నారు. మ్యాకో రోబోట్ ఇది ఒక్కటే 3 సర్జరీలు చేయగలదని, మొత్తం మోకాలు, కొంత మోకాలు, టోటల్ హిప్ ఆపరేషన్ మ్యాకో రోబోట్‌తో మాత్రమే సాధ్యమని ఆయన అభిప్రాయ పడ్డారు.

## ఎర్రమంజిల్ కాలనీలో గుడిసెల తొలగింపు.. అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : నగరంలోని ఎర్రమంజిల్ పరిధి రామకృష్ణానగర్‌లో గుడిసెల తొలగింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున రోడ్లుభవనాల శాఖ, జిహెచ్ఎంసి, రెవెన్యూశాఖ, పోలీసు సిబ్బంది సుమారు 200 మంది అక్కడికి చేరుకొని గుడిసెల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించారు. సమాచారం అందుకున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అక్కడికి చేరుకొని అధికారులతో వాగ్వాదానికి దిగారు. గుడిసెలను కూల్చవద్దని.. నివాస వసతి కల్పించాకే ఖాళీ చేయించాలని ఆమె డిమాండ్ చేశారు. అక్కడున్న పేదలు ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ఈ క్రమంలో అధి కారులతో ఆమె వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీ సులు విజ యారెడ్డిని అరెస్టుచేసి ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గుడిసెల్లో నివసిస్తున్న పలువుర్ని అదుపులోకి తీసుకొని బంజా రాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## కెటిఆర్‌కు కల్లుగీత ఇతివృత్తాన్ని వెల్లడించే చిత్రాన్ని అందజేసిన గౌడ సంఘాల నేతలు



కల్లుగీత ఇతివృత్తాన్ని వెల్లడించే చిత్రాన్ని మంత్రి కెటిఆర్‌కు అందజేస్తున్న పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : కల్లు గీత చారిత్రక నేపథ్యాన్ని వెల్లడించే చిత్రాన్ని తెలంగాణ గౌడ సంఘం నేతలు మంత్రి కెటిఆర్‌కు అందజేశారు. బుధవారం ప్రగతిభవన్‌లో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు, గౌడ హాస్టల్ కమిటీ ఛైర్మన్ పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు చిదుగు గోవర్ధన్‌గౌడ్, కొండా రమేష్‌గౌడ్, సంజయ్‌గౌడ్ మంత్రి కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా దేవతల నుండి నేటి వరకు తాటి, ఈత, ఖర్జూర చెట్ల నుంచి కల్లు గీత వృత్తి నేపథ్యాన్ని వివరించే చిత్రాన్ని మంత్రికి అందజేసి ఈ వృత్తి విశిష్టతను వివరించారు.

## ప్రభుత్వ ఉద్యోగాలు అందని ద్రాక్షలా ఉన్నాయి : ఈటెల రాజేందర్



సికింద్రాబాద్ వైఎంసీఏలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, సంస్థ అధ్యక్షులు పిట్ల నాగేశ్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలు అందని ద్రాక్షలా మారాయని, అవి కేవలం 3 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయ హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ తెలిపారు. కొర్వి క్రిష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నాగేశ్ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ వైఎంసీఏ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది విద్యావంతులు కష్టపడుతున్నప్పటికి ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలు రాసే నిరుద్యోగులు కష్టపడి చదవాలని, ఉద్యోగం కోసం అలసి పోకుండా పట్టుదలతో చదివి మంచి ర్యాంక్‌లు ,సాధించాలన్నారు. ఈ కార్యక్ర మంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవ రెడ్డి, కొర్వి క్రిష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి ప్రతినిధులు ఇన్‌ఫోటెక్ ఎండి లాస్య, ప్రతినిధులు ఒరుగంటి వెంకటేశ్వర్ యాదవ్, తేజ, నాగుల శ్రీనివాస్ యాదవ్, సత్యం, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్ ఆ ఇద్దరు

**అవినీతిలో రికార్డు సృష్టిస్తోన్న విద్యుత్ ఏడీఇ కార్యాలయాలు**

బహుళంతస్తుల, కమర్షియల్ భవనాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు రెండు లక్షల నుంచి ఐదు లక్షలు, పది లక్షలకు పైగానే ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా పనికో రేటు అన్నట్లు లక్షల్లో దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏడీఇలు, ఏఇలు, లైన్‌మెన్లు, లైన్‌ఇన్స్‌పెక్టర్‌లు అక్రమ భాగోతంలో పాత్రదారులవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కొందరు ఏడీఇలు, ఏఇలు ఈ అక్రమాలకు సహకరిస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉండే ఈ విభాగం అధికారులు కుమ్మక్కై పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతూ రూ. కోట్ల మేర అక్రమాస్తులు కూడబెట్టినట్లు తెలిసింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించకపోవడంతో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : టీఎస్ఎస్పీడీసీఎల్ (విద్యుత్) ఇబ్రహీంబాగ్, చేవేళ్ళ ఏడీఇ కార్యాలయాలతోపాటు శంకర్‌పల్లి, మొయినాబాద్, ఇబ్రహీంబాగ్, నార్సింగి, చేవేళ్ళ, షాబాద్ ఏఇ కార్యాలయాలు అవినీతిలో రికార్డు సృష్టిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఏడీఇ, ఏఇ కార్యాలయాలు అక్రమ వసూళ్ళకు అడ్డాలుగా మారాయి. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారుల మూలంగా ఎంతో మంది దరఖాస్తుదారులు నెలలతరబడి తమ పనులు క్లియర్ కావడం కోసం పడిగాపులు కాస్తున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎవరైనా మామూళ్ళను ఎందుకు ఇవ్వాలని ఉన్నతాధికారులు, కిందిస్థాయి అధికారులను అడిగితే తమ కుర్చీ కోసం లక్షలు ఖర్చుపెట్టామని, మామూళ్ళను ఇవ్వకతప్పదని అంటున్నట్లు తెలిసింది. కొందరు అధికారులు అయితే బంధువులు, ఇతరులను బినామీలుగా పెట్టుకుని కాంట్రాక్ట్ పనులను దక్కించుకుంటున్నారని తెలిసింది. పలు ప్రాంతాల్లో వ్యక్తిగత గృహాలు, బహుళంతస్తుల భవనాలతోపాటు కమర్షియల్ భవనాలు వెలుస్తున్నాయి. కొత్త కనెక్షన్ కావాలన్నా, కొత్త లైన్ వేయాలన్నా, అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలన్నా, ఇంటి ముందు అదనపు విద్యుత్ సంభం ఏర్పాటు చేయాలన్నా పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వనిదే పనులు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త విద్యుత్ కనెక్షన్లకు వర్క్ ఎస్టిమేషన్ నుంచి బహుళ అంతస్తులకు ప్యానల్ బోర్డులు, డీటీఆర్ మీటర్ల జారీలకు అందినంత దండుకుంటున్నారు. పలు ప్రాంతాల్లోని వివాదస్పద స్థలాల్లో నిర్మించిన నిర్మాణాలకు ఎలాంటి కనెక్షన్లు ఇవ్వడానికి వీలు లేదు. అయితే పెద్ద మొత్తంలో మామూళ్ళను తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్లను, ప్యానల్ బోర్డులను మంజూరు చేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఏడీఇలు, ఏఇలు తనిఖీలు, సమావేశాల పేరుతో కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి. దీంతో కార్యాలయాలకు వినియోగదారులు వస్తే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుసటి రోజు వచ్చిన వారికి అధికారులు సకాలంలో కలవడానికి సమయం ఇవ్వకపోవడంతో వినియోగదారులకు నిరీక్షణ తప్పడంలేదు. అయితే ఉన్నతాధికారులు పలు కార్యాలయాల్లో తనిఖీలను మరిచిపోయారన్నట్లుగా ఉంది. తనిఖీలు లేకపోవడం అధికారులు, సిబ్బందికి వరంగా మారింది. వీరు కార్యాలయాలకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియక వివిధ పనులపై వస్తున్న ప్రజలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

**అవినీతి రాజాలు ఆ ఇద్దరు ఎవరూ..?**

ఏడీఇ, ఏఇ కార్యాలయాల్లో అవినీతిలో ఘనాపాటీలైన ఓ ఇద్దరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వారు అడిగినన్నీ మామూళ్ళు ఇస్తేనే పనులు చేస్తున్నట్లు, లేకుంటే విపరీతమైన జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అపార్ట్‌మెంట్లకు కనెక్షన్ కావాలంటే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కనెక్షన్లు, ప్యానల్ బోర్డులు, స్విచ్‌గేర్‌లు, ఎర్తల మంజూరుకు గాను పెద్దమొత్తంలో మామూళ్ళను వసూలు చేస్తున్నారు అపార్ట్‌మెంట్లలో డీటీఆర్ మంజూరుకు ఓ రేటు కమర్షియల్ బహుళంతస్తుల భవనాలకు మరో రేటు, కొత్త కనెక్షన్లు, ప్యానల్ బోర్డులు, డీటీఆర్‌లు, లైన్ల మంజూరుకు కొందరు ఏడీఇలు, ఏఇలు తమ ఇష్టారాజ్యంగా వసూళ్ళకు ప్పాలుడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో హాత్ సే హాత్ జోడో యాత్ర



కార్మికనగర్‌లో హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంతరావు, మాజీ శాసనసభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : ఏఐసీసీ సూచనల మేరకు తెలంగాణ కాంగ్రెస్ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు అనుసంధానంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని కార్మికనగర్ చౌరస్తా నుంచి ఎస్పీఆర్ హిల్స్ మీదుగా సైట్3, సైట్2 వరకు నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి వీనూత్నంగా కొత్తదనంతో పంచకట్టుతో యాత్రలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పీసీసీ మాజీ అధ్యక్షులు వీ.హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ రోహిన్‌రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు సోహెల్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బల్మూత్ వెంకట్, బీసీ సెల్ ఛైర్మన్ శ్రీకాంత్ డౌడ్, కోటంరెడ్డి వినయ్‌రెడ్డిలు పాల్గొన్నారు. కార్మికనగర్ నుంచి మొదలైన ఈ యాత్రకు ప్రజల అడుగడుగున నిరాజనాలు పలికారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర విజయవంతం కావటంతో తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రజలు కాంగ్రెస్ పట్ల ఆకర్శితులై పార్టీని గెలుపించుకునేందుకు సుముఖతంగా ఉన్నారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని గతంలో దివంగత మాజీ ఎమ్మెల్యే పీజేఆర్ పేదల కోసం అహర్నిశలు కష్టపడి పేదలకు మౌలిక సదుపాయాలతో పాటు ఇళ్ల సౌకర్యం కూడా కల్పించారన్నారు. ర్యాలీలో ఎస్పీఆర్ హిల్స్‌లోని పీజేఆర్ దేవాలయంలో ఆయన తనయుడు పీవీఆర్ ఆయన విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రహమత్‌నగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ భవాని శంకర్, జేపీ జ్ఞానేశ్వర్, లియాకత్ అలీ, కదీర్, కృష్ణకుమార్, సలీమ్‌జావేద్, బిట్ల సుశీల్‌కుమార్, అర్జున్, అశోక్, ధనవీర్, ఇందర్‌కుమార్ గౌడ్, రవిందర్‌రెడ్డి, గ్యారే నాగరాజు, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఆరా

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై దృష్టి సారించనట్టు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ పి విజయారెడ్డిలు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని ప్రజల ప్రధాన సమస్యలైన మంచి నీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు, తదితర వంటి వాటిపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న టువంటి పలు సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్య మన్నారు. ఖైరతాబాద్‌లోని పలు బస్తీలకు చెందిన పెద్ద లు, పలు సేవాసంస్థల వారు, సంఘాల వారు కొందరు కొన్ని సమ స్యలపై వారిరువురి దృష్టికి తీసుకువచ్చినట్లు వారి అనుచర వర్గా లు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సమస్యలు పరిష్క రించేం దుకు పలు సంస్థల అధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది.

## ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో లైట్లు వెలిగాయి

వార్త ప్రభావం



బేగంపేట ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలె గడచిన కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగక పోతుండటంపై ఈ నెల 19న హైదరాబాద్ జిల్లా ప్రభాతవార్త సంచిక లో, వీధిలైట్లు వెలగడం లేదు. అనే కథనం ప్రచురి తమైంది. ఈ కథనంపైన స్పందించిన అధికారులు వెంటనే వీధిలైట్లను బాగుచేయడంతో వీధిలైట్లు వెలిగాయి. ప్రభాతవార్త కథనంతో తమ బస్తీలో వీధిలైట్లు రావడం పట్ల బేగంపేట డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వాహెద్ హర్షం వ్యక్తం చేసారు.

## శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



10 లక్షలతో డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లోని మేదర్‌బస్తీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా పది లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక మేదర్‌బస్తీ ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. అలాగే బస్తీలో చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి స్థానిక నాయకు లతోపాటు అధికారులతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, బిఆర్ఎస్ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు షేక్ రజాక్ మృతి పట్ల సంతాపం

చార్మినార్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :పాతబస్తీ చార్మినార్ నియోజకవర్గం పరిధిలోని కాలీకబర్ ప్రాంతానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు షేక్ రజాక్ (42) మృతి పట్ల సీనియర్ బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్,మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్‌తో పాటు పలువురు నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ నాయకులు షేక్ రజాక్ మంగళవారం గుండె పోటుతో మరణించారు.కాగా షేక్ రజాక్ మరణం పార్టీకి తీరని లోటు అని వారు తెలిపారు.చని పోయిన షేక్ రజాక్‌కు భార్య,కుమారుడు కలరు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారనంగా ఈ నెల 23వ తేదీ గురవారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు జిఎం చావనీ,ఇంద్రానగర్,2 నుంచి 4 గంటలు వరకు నీలం సెంటర్,అన్వర్ మిర్చి ఫీడర్ల పరిధులలో,1 నుంచి 4 గంటలు వరకు హుస్సేనీఆలం,పెట్లాబుర్జు ఫీడర్ల పరిధులలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు సిబిడి అధికారులు తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుడిపైన జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం : పిసిసి సభ్యులు సత్యంశ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల మీద దాడులు చేయటం కుట్రపూరిత రాజకీయాలు చేయటం బిఆర్ఎస్‌కే చెల్లిందని పిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం ధ్వజమెత్తారు. సోమవారం ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ గూండాల పాశవిక దాడిలో తీవ్రంగా గాయపడిన యూత్ కాంగ్రెస్ కార్యకర్త తోట పవన్‌పైన జరిగిన దాడిని సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వికృత రాక్షస మనస్థత్వంతో దాడి చేశారని దీనికి మూల్యం చెల్లించుకోకతప్పదని అన్నారు. ప్రశ్నించే గొంతులపై దాడి చేస్తున్న బిఆర్ఎస్ రౌడీలకి బుద్ది చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, కాంగ్రెస్‌కు వచ్చే ఆదరణను జీర్ణించుకోలేక ఈ దాడులకు పాల్పడుతున్న బిఆర్ఎస్‌కు తగిన శాస్తిజరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఓటమి భయంతో కొందరు నాయ కుల కక్షపూరిత చర్యలు చేస్తున్నారని, ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని ఒక వ్యక్తిని కొట్టే హక్కు వారికి ఎవరిచ్చారని ప్రశ్నిం చారు. విమర్శలకు ప్రతి విమర్శించాలి కానీ హత్యాయత్నం చేయడం సమస్మతంకాదని, దీనికి ప్రతి దాడికి దిగడానికి కాంగ్రెస్‌కు ఒక్క నిమిషం పట్టదని హెచ్చరించారు.

## ట్రాఫిక్ సిగ్నల్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తాం

**బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు**



బేగంపేట టీటీఐ లో విద్యార్థులకు నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : నగరంలో రోజు రోజుకు రోడ్లపైకి వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతుం దని, దీన్ని దృష్టిలో ఉంచుకొని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. బుధవారం బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్టిట్యూట్‌లో ట్రాఫిక్ శిక్షణా సంస్థ, హీరో ట్రాఫిక్ శిక్షణ ప్రాక్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రాక్ స్కూలులో ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.గీతాంజలి ఒలింపియాడ్ పాఠశాల కు చెందిన 96 మంది విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏసీపీ శంకర్ రాజు మాట్లా డుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే ట్రాఫిక్, సిగ్నల్స్ వంటి వాటిపై అవగాహ న కల్పిస్తున్నామని, అది వారికి భవిష్యత్‌లో ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హీరో ట్రాఫిక్ శిక్షణ ప్రాక్ సిబ్బంది బి.శ్రావణ్ కుమార్, ఎం.భార్గవి ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కొజ్జా' అనే పదాన్ని తక్షణమే నిషేధించాలి

**శంకర్‌నాయక్, షర్మిలా తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి**

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: తమ రాజకీయ స్వార్ధ ప్రయోజనాల కోసం అనోవసరంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, వైఎస్ఆర్‌టిపి వ్యవస్థాపకురాలు వై.షర్మిలా 'కొజ్జా' అనే పదాన్ని ఉపయోగించి అవమానించడాన్ని ట్రాన్స్ మార్చ్ సమిష్టిగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రాన్స్ మార్చ్ కలెక్టివ్‌కు సంబంధించిన పలు సంఘాల నాయకురాళ్ళు మోనాలిసా, జాస్మిన్, విష్ణుతేజ, రచన, నందిత, నీతు, అవంతిక, సమైన , అంజలి తదితరులు మాట్లాడుతూ మరొకసారి ఎవరైన కొజ్జా అనే పదాన్ని ఉపయోగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే ధర్నాలు, ర్యాలీలు నిర్వహి స్తున్నామని భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తామని వారు హెచ్చరిం చారు. కొజ్జా పదాన్ని ఉపయోగించి, తమను అవమానపరిచిన శంకర్‌నాయక్, షర్మిలా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పదాన్ని తక్షణమే నిషేధించాలని. ఇందుకోసం చట్టం చేయాలని, అసెంబ్లీలో చర్చించాలని వారు డిమాండ్ చేశారు.

## చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా : మంత్రి తలసాని



మారేడ్‌పల్లిలో చిత్ర కథానాయక సబితను సన్మానిస్తున్న మంత్రి తలసాని తదితరులు

కంటోన్మెంట్, ఫి బ్రవరి 22 ప్రభాతవార్త: చలన చిత్ర పరిశ్రమ అభివృ ద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుం దని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ తెలి పారు. బుధవారం ప్రము ఖ సాంస్కృతిక కళా సంస్థ ఆకృతి నిర్వాహణలో మారేడ్‌పల్లిలోని మంత్రి తలసాని క్యాంప్ కార్యాలయంలో సినీ దర్శకుడు విశ్వనాథ్ 93వ జయంతిని పురస్కరించుకొని సప్తపది చిత్ర కథానాయక సబితను మంత్రి తలసాని శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సినీ దర్శకుడు విశ్వనాథ్ తెలుగు చలన చిత్ర దశ దిశలను మహోన్నత శిఖరాలకు చేర్చిన మహనీయుడన్నారు. ఎందరో కళాకారులు విశ్వనాథ్ చిత్రంలో ఒక్కసారైనా నటించాలని కలలు కంటారన్నారు. అలాగే ఒక్క చిత్రంలో నటించిన సప్తపది సబితకు ఆయనతో పనిచేసిన మధుర స్మృతులు ఎల్లకాలం గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనీల్‌కుర్మాచలనం, ఆకృతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికిన మేయర్ మహేందర్‌గౌడ్



తెలంగాణ పోలీసు అకాడమి చౌరస్తాలో మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : రాష్ట్ర మున్సిల్ అండ్ ఐటి శాఖ మంత్రి కేటీఆర్‌కు బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ ఘన స్వాగ తం పలికారు. బుధ వారం రంగారెడ్డి జిల్లా లోని చందన్‌వెల్లిలో అత్యాధునిక సాంకేతిక టెక్స్‌టైల్స్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు వెళ్తున్న మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ పోలీసు అకాడమి చౌరస్తాలో భారీ స్వాగతం పలికారు. మంత్రికి మొక్కను అందజేసి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల లో పూరినత అవగాహన పెంచుకొని సీఎం కేసీఆర్‌కు తగ్గ తనయుడుగా కేటీఆర్ ఎదుగడం గర్వంగా ఉందన్నారు. మున్సిపల్, కార్పొరేషన్‌లలోని సమస్యలు కేటీఆర్ దృష్టికి తీసుకెళితే వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలపై వేగంగా స్పందించే మంత్రి లభించడం మన అదృష్టమన్నారు. మంత్రి కేటీఆర్‌ను స్వాగతించిన వారిలో ఎంపి రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, కాంటెస్టెడ్ ఎంపి పి.కార్తిక్‌రెడ్డి తదితరులున్నారు.

## వస్త్రాల మార్కెట్‌లో చలివేంద్రం ఏర్పాటు

చార్మినార్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : ఎండలు రోజు,రోజుకు పెరుగుతుండటంతో పాతబస్తీలోని వస్త్రాల మార్కెట్లలో బట్టలు ఖరీదు చేయటానికి వచ్చే వినియోగదారుల కోసం అశోక్ ఫౌండేషన్ అధ్యక్షులు ఫంకజ్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో రికాబ్‌గంజ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భం గా ఫంకజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రతా సంవత్సరం వేసవి కాలంలో రికాబ్‌గంజ్‌లో చలి వేంద్రం కేంద్రాన్ని ఏరా ్పటు చేస్తున్నామని తెలిపారు.వ్యాపారులు సురేంద్ర అగర్వాల్,ప్రియాం క అగర్వాల్, శ్రీనివాస్,సునీల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంది



విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పె పాఠాలమీదే ఆధారపడి ఉందని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్ గౌడ్ చెప్పారు. ఉపాధ్యాయు లు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటే వారి భవిష్యత్తు బంగారంలా ఉంటుందన్నారు. విద్యార్థులకు పరీక్షలు దగ్గరపడుతున్నందున బుధవారం హైదర్‌గూడలోని సెంట్ పీటర్స్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, డిప్యూటి డిఈఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బందితో కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పరీక్షలు దగ్గరపడుతున్నాయనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయరాదని సూచించారు. మంచి మాటాలతో హృదయాలను హత్తుకునే విధంగా విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి పరీక్షల్లో విజయం సాదించేలా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పిల్లలు అందరికి ఉంటారని వారి బంగారు భవిష్యత్తుకు అంతరాయం కలిగించవద్దని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జి.రామన్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో గుండాయిజం ఓడిందని ప్రజాస్వామ్యమే గెలిచింది

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: నిరంకుశం ఓడిందని, ప్రజాస్వామ్యం గెలిచిందని, గుండాయిజం ఓడిపోయి ఢిల్లీ ప్రజలు గెలిచారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ డాక్టర్ దిడ్డి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ ఢిల్లీ మేయర్‌గా ఎన్నిక కావడంపై హైదరాబాద్ లిబర్టీ సర్కిల్ ఆఫ్ కార్యా లయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 150 ఓట్లు సాధించి బిజెపి అభ్యర్థి రేఖాగుప్తాను 34 ఓట్ల తేడాతో ఓడించారు. బిజెపి తన కుట్రలతో ఢిల్లీ ఆప్ కార్పొరేటర్లకు కోట్ల రూపాయలు ఎరచూపి కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిందని ఆయన ఆరోపిం చారు. గత డిసెంబరు మాసంలో జరిగిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ స్పష్టమైన విజేతగా నిలిచిందని దుర్బుద్ధితో బిజెపి మేయర్ ఎన్నికను అడ్డుకుందని అనేక జాప్యాల తరువాత మేయర్ ఎన్నికలు జరిగాయని సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని వీలైనంత త్వరగా మేయర్ ఎన్నిక జరపాలని ఆదేశాలు జారీ చేయడంతో బిజెపి దిగివచ్చిందన్నారు. ఢిల్లీ ప్రజలకు, మేయర్‌కు, డిప్యూటి మేయర్‌కు ఈ సందర్భంగా సుధాకర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్రీడలను ప్రోత్సహించాలి

కార్పొరేటర్లు రవిచారి, శంకర్‌యాదవ్



సర్టిఫికెట్లు అందచేస్తున్న కార్పోరేటర్లు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త: మానసిక వత్తిడి తగ్గించేందుకు విద్యార్థులను, యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలని రాంనగర్ కార్పోరేటర్ రవిచారి, బేగంబజారు కార్పోరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సి ల్ మెంబర్ శంకర్ యాదవ్‌లు అన్నారు. బుధవారం దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో రెండవరోజు కొనసాగుతున్న ఖేలో సికింద్రాబాద్, జీతో సికింద్రాబాద్ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రెండవరోజు పోటీలో ఓడిపోయిన ఏడు టీంలకు వారు సర్టిఫికెట్లు అందచేశారు. అనంతరం సికింద్రాబాద్ జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జి మద్దూరి శివాజీ మాట్లాడుతూ రెండవరోజు క్రికెట్ పోటీలలో కూడా మొత్తం 14 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ నుండి ఐదు టీంలు, గాంధీనగర్ డివిజన్ నుండి నాలుగు టీంలు, అడిక్‌మెట్ నుండి, వ్యాయామకళాశాల నుండి ఐదు టీంలు ఈ పోటీలో పాల్గొన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు, గగన్‌మహల్ మైదానం ఇన్‌చార్జి ఏ.వినయ్ కుమార్, వెంకటేష్, బీజేవైఎం నాయకులు భరత్‌గౌడ్, గడ్డం నవీన్‌కుమార్, అనిల్, అరుణ్, కిరణ్ యాదవ్, సాయియాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీరు, డ్రైనేజి సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త: ముషీరాబాద్ డివిజన్‌లో ఉన్న మంచినీరు, డ్రైనేజి సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని ముసీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. బుధవారం జలమండలి అధికారులతో కలసి ముషీరాబాద్ డివిజన్ ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయన పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముషీరాబాద్ లోని పలు ప్రాంతాలలో మంచినీరు, డ్రైనేజి పైప్‌లైన్‌లు పాడయిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని, వీటిని త్వరలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించటం జరిగిం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, జలమండలి అధికారులు డీజీఎం మోహన్‌రాజ్, మేనేజర్ నవీన్, స్థానిక నాయకులు వై.శ్రీనివాస్, రెబ్బ రామారావు, శ్రీధర్‌రెడ్డి, శివము దిరాజ్, గోరఖ్నాధ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎయిర్‌టెల్ రాజు, నర్సింగ్‌రావు, రహీం, మహ్మద్ అలీ, ప్రవీణ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

**చెక్కుల పంపిణీ:** ఇటీవల కరోనాతో మృతి చెందిన కుటుంబాలకు ఎస్ఆర్‌డి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లో చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిధిగా హాజరై చెక్కులను బాధిత కుటుంబాలకు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవ చేసే కార్యక్రమాలు చేపడుతున్న ఎస్ఆర్‌డి స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన కుస్తీ పోటీలు

**ముగింపు పోటీల్లో పాల్గొన్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్**



చత్రపతి శివాజీ కేసరి టైటిల్‌ను అందజేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్

మెహిదీపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : గుడిమల్కాపూర్ డివిజన్ తాళ్లగడ్డ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగిన కుస్తీ పోటీలు ముగిసాయి. దేవర కరుణాకర్ మెమోరియల్, హింధువాహిని ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన కుస్తీ పోటీల్లో మల్లయోదులు హోరాహోరిగా తలపడ్డారు. బుధవారం జరిగిన ముగింపు పోటీల్లో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పాల్గొని విజేతలకు చత్రపతి శివాజీ మెమోంటోలతో పాటు నగదును అం దజేశారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లా డుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిం చాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు వ్యాయామం తప్పని సరిగా చేయాలన్నారు. కుస్తీ నేర్చుకోవడం అంత సులువుకాదన్నారు. నిరంతర శ్రమ, పట్టుదల ఉంటేనే కుస్తీ పోటీల్లో గెలుపొందడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం పురా ణాపూల్‌కు చెందిన సాహిల్‌సింగ్‌కు చత్రపతి శివాజీ కేసరి టైటిల్, కార్వాన్ రహీంపురకు చెందిన దినేష్‌సింగ్‌లకు బాలకేసరి టైటిల్‌ను అందజేశారు. కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులకు కాసాని జ్ఞానేశ్వర్ తాను సొంతంగా రూ.10వేల నగదును అందజేశారు. ఈ మూడు రోజుల పాటు జరిగిన ఈ కుస్తీ పోటీల్లో 400 మంది మల్లయోదులు పాల్గొన్నట్లు హింధువాహిని గోల్కొండ బాగ్ అధ్యక్షులు గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, బండారి విద్యాసంస్థల అధినేత బండారి శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర నాయకులు ఉమారాణి, దేవర శ్రీనివాస్, టిడిపి కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారి వెంకటేష్ నాయకులు బుగిడి అనూప్ కుమార్, సురేందర్‌సింగ్, నామ యాదగిరి నేత, కూరాకుల కృష్ణ, దేవర వంశీ, శ్రీకాంత్‌సాగర్, వెంకటేష్ సాగర్,ప్రభుపూజారి మల్లయోదులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలు కట్టడి చేసేందుకు సిసి కెమెరాలు తప్పనిసరి : ప్రభుత్వవిప్ గాంధీ



ప్రభుత్వవిప్ గాంధీని కలిసి వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ 34, 35 బ్లాక్స్, కమల ప్రసన్న నగర్, వెంకటేశ్వరనగర్, వీకర్ సెక్షన్ కాలనీ, మాధవరం నగర్ బి, సి బ్లాక్ కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలని కాలనీల అసోసి యేషన్ సభ్యులు, కాలనీ వాసులు మాజీ కార్పోరేటర్ మాధవరం రంగా రావుతో కలిసి ప్రభుత్వవిప్ గాంధీని ఆయన నివాసంలో మర్యా దపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీల నిఘా రక్షణకోసం, మహిళల భద్రత, దొంగతనాల నివారణ కోసం, గొలు సు దొంగతనాలు అరికట్టుట కోసం, పోకిరీల బెడద వంటి సమస్య ల పరిష్కారం కోసం కాలనీలలో ప్రశాంత వాతావరణం కోసం సీసీ కెమెరా లు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వవిప్ గాంధీ మాట్లాడుతూ కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని, తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామి ఇచ్చారు. దొంగతనాలు అరికట్టడానికి, పోకిరీల బెడద నుండి కాపాడుతామని, మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని పేర్కొ న్నారు. ఈకార్యక్రమంలో సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, పలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 8 లక్షల మంది విద్యార్థుల హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలి

**రాష్ట్ర మంత్రి కమలాకర్‌తో ఆర్.కృష్ణయ్య చర్చలు**



మంత్రి గంగులకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య, కోలా జనార్ధన్, గుజ్జ కృష్ణ, జిల్లపల్లి అంజీ తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 8 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బిసి కళాశాల హాస్టల్, పాఠశాల హాస్టల్ విద్యార్థుల, రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను తక్షణమే పెంచాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సంఘం ప్రతినిధి బృందం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా మంత్రితో రాజ్యసభ సభ్యుడు, సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు లాల్‌కృష్ణ, మల్లేష్‌యాదవ్, జిల్లపలి అంజీ తదితరులు చర్చలు జరిపారు. మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌ల పెంపుదల కోసం సిఎం కెసిఆర్ ఈ మేరకు పలువురు మంత్రులతో కూడిన ఒక ఉప సంఘాన్ని వేయడం జరిగిందని, ఈ కమిటీ తక్షణమే సమావేశమై మెస్ ఛార్జీలు పెంచుతూ తాము చేసిన పలు సిఫార్సులను అమోదిం చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బిసి కళాశాల విద్యా ర్థుల మెస్ చార్జీలను పెరిగిన ధరల ప్రకారం 1500 నుంచి నెలకు 3వేలకు పెంచాలని, పాఠశాల హాస్టళ్ళకు-గురుకుల పాఠశాల విద్యార్థుల ఆహారపు చార్జీలు9 8నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 1100 నుంచి 2,500లకు పెంచాలని 3 నుంచి 7వ తరగతి వారి వరకు 950 నుంచి 2 వేలకు పెంచాలని, దే స్కాలర్‌షిప్‌లను ఇంటర్, డిగ్రీ కోర్సులకు 5500 స్కాలర్‌షిప్‌లు, ఇంజనీరింగ్, పిజి ఇతర కోర్సులకు 6500 స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నందున ఒకేటే శ్లాబ్‌గా 10 వేలకు పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. పాఠశాల, గురుకుల విద్యార్థులకు గత 14 సంవత్సరాలుగా కాస్మోటిక్ చార్జీలు పెంచలేదని, ప్రస్తుతం నెలకు ఇస్తున్న 400 రూపాయలను పెంచాలని, బిసి విద్యార్థులకు పాకెట్ మనీ 500 రూపాయలు మంజూరు చేయాలని, ప్రతి హా స్టల్‌కు 5 కంప్యూటర్స్ మంజూరు చేయాలని కళాశాలల హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ త్వరలో మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమై మెస్ ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచుతూ నిర్ణయి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యా ర్థులకు అన్ని సౌకర్యాలు సమానంగా పంచుతామని చెప్పారు.

## ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : శివారెడ్డి



కోకాపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గాంధీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో పాల్గొన్న కౌన్సిలర్ శివారెడ్డి

నార్సింగి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోకాపేట్ కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట్ ప్రభుత్వ పాఠశాలలో గాంధీ ఆసుపత్రి వైద్య సిబ్బంది ది హెల్త్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశు భ్రత, పరిస రాల పరిశుభ్రత, కాలుష్యం, పౌష్టికాహారం, శారీరక శ్రమ, వ్యాయామం చేయడం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ చదువుకిస్తున్న ప్రాధాన్యత ఆరోగ్యం, ఆటలకు కూడా ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు ఎంతసేపు తమ బిడ్డలను ఎన్ని మార్కులు వచ్చాయి? ఫస్ట్ ర్యాంకు ఎందుకు రాలేదు? అని ప్రశ్నించడంతో పాటు ఆరోగ్యం కోసం వ్యాయామం, ఆసనాలు, యోగ చేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. శారీరకంగా బలంగా ఉన్న వారే అన్ని విషయాలలో బలమైన నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. పిల్లలను పుస్తకాల పురుగుల్లా మార్చవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు బలమైన ఆహారాన్ని అందించి, వారి శారీరక వికాసానికి బాటలు వేయాలని శివారెడ్డి తెలిపారు. శారీరకంగా వీక్ ఉన్న విద్యార్థులకు విటమిన్ ట్యాబ్లెట్లు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో శానటనీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, గాంధీ ఆసుపత్రి వైద్యులు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

## కళలు ఏ ఒక్కవర్గానికి పరిమితంకావని నిరూపించిన దర్శకుడు విశ్వనాథ్



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: శంకరాభరణం సిని మా నేను చూశాను, మా ఇంటి లో పని చేసే ఆవిడా చూసి బాగుంది అని చెప్పింది, అందరు మెచ్చుకోవటానికి కారణం కళలు ఏ ఒక్కవర్గా నికి పరిమి తంకావని కళాతపస్వీ కె.విశ్వనాథ్ నిర్మించిన చిత్రాల సందేశం అని ప్రముఖ కవి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.గోపి అన్నారు. బుధవారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ప్రము ఖ సినీదర్శకులు, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డుగ్రహీత, పద్మశ్రీ డాక్టర్ కె.విశ్వనాథ్ 93వ జయంతి సందర్భంగా 'పాడనా తెలుగుపాట' పేరుతో కె.విశ్వనాథ్ సినీ సంగీత విభావరి' కార్యక్రమం జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎన్.గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.రాజగోపాలరావు, ప్రముఖ సాహితీవేత్త, ఎస్‌బిఐ డీజీఎం వెంకట్ గరికపాటి, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు,రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకుడు వైఎస్.రామకృష్ణ బృందం ఆధ్వర్యంలో కె.విశ్వనాథ్ నిర్మించిన చిత్రాల నుంచి పాటల విభావరి అందరిని అలరించింది. విశ్వనాథ్ సినిమాలు సంస్కారవంతంగా కులం కన్నా గుణం మిన్న అనే సందేశంతో ముడిపడి ఉంటాయన్నారు.

## టెన్నిస్ బంగారు పతక విజేతకు అభినందనలు



భవానీ కేడియాను అభినందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మాజీ ప్రభుత్వ కార్యదర్శి అజయ్ మిశ్రా బండి రమేష్

బేగంపేట ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : టెన్నిస్ బంగారు పతాక విజేత భవానీ కేడియాకు పలువురు అభినందనలు తెలియజేసారు. 25వ జాతీయ డెఫ్ సీనియర్ స్పోర్ట్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించిన తెలంగాణా కు చెందిన భవానీ కేడియాను పలువురు అభినందనలు తెలియజేసారు. మినిస్టర్ రోడ్డులోని ఇలాచీ కేఫ్ రెస్టారెంట్ లో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, మాజీ ప్రభుత్వ కార్యదర్శి అజయ్ మిశ్రా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్, అధికార ప్రతినిధి మహ్మద్ కాలిఖర్ రెహ్మాన్ లతో పాటు పలువురు అతిథులు ఆమెను అభినందించారు. ఇండోర్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగిన ఈ పోటీల్లో ఆమె బంగారు పతకం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేసారు. ఈ కేటగిరిలో బంగారు పతకం సాథించిన మొట్టమొదటి యువతి భవానీ కేడియా అని వారు పేర్కొన్నారు. ఆమెకు సరైన శిక్షణ మనోధైర్యం ఇస్తూ ఈ స్థాయికి తీసుకు వచ్చిన ఆమె తల్లి దం డ్రులను నీరజ్ కేడియా మధు కేడియా, కోచ్ గోపీరాజ్‌ల కృషి ఎంతో ఉందని వారు కొనియాడరు. ఇలాంటి క్రీడాకారులకు ప్రభుత్వం సహకారం అందించాలని, రానున్న రోజుల్లో ఆమె మరిన్ని విజయాలు అందించాలని వారు కోరుకున్నారు.

## రజాకార్ల పార్టీకి కొమ్ముకాస్తున్న సీఎం కేసీఆర్ : ఠాకూర్ అమర్‌సింగ్


గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : రజాకార్ల పార్టీకి కొమ్ముకాస్తూ హిందువుల మనోభావాలను సీఎం కేసీఆర్ దెబ్బతీస్తున్నారని బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్ ఆరోపించారు. మజ్లిస్ పార్టీకి సలాం కొడుతున్న కేసీఆర్ నేనే పెద్ద హిందువునని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా గోస – బిజెపి భరోసా పేరుతో గుడిమల్కాపూర్ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఠాకూర్ అమర్‌సింగ్‌తో పాటు బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్, బిజెపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆరుణ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం కోట్లా ది నిధులను విడుదల చేస్తుందన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమల వుతున్నాయన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న హిందూ వ్యతిరేక పాలనను అంతమొందిం చాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రానున్న బిజెపి ప్రభుత్వమేనన్నారు. సమన్వయం తో పనిచేస్తూ ప్రతి కార్యకర్త ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డిజ్వర్‌సింగ్, ఆకుల గోవర్ధన్, ఇంద్ర సేనారెడ్డి, బండారు రాధిక, కట్ల అశోక్, సునీల్ యాదవ్, పింజర్ల శ్రీనివాస్, రక్షిత్ సాగర్, దేవా యాదవ్, కార్తీక్, కరుణ కుమారి, శ్రీపతి సాగర్, నారాయణదాసు, ప్రవీణ్, ఆకాశ్‌సింగ్, శ్రవణ్, రామకృష్ణచారి, మల్లేష్ యాదవ్, వెంకటేష్ జోషి, యాదగిరి, శ్రవణ్ కార్యకర్తలు బస్తీ వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సాయన్న అంత్య క్రియలను కావాలనే అధికారికంగా జరపలేదు


పికెట్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నివాళి అర్పిస్తున్న బిఎస్‌పి నాయకులు

బేగంపేట ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : కంటోన్మెంట్ సిట్టింగ్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను అధికారికంగా చేయకుండా, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బహుజనుల మీద వివక్ష పూరితంగా వ్యవహరించారని, బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు రుద్రవరం సునీల్ ఆరోపించారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గం పికెట్ అంబేద్కర్ చౌరస్తా లో సాయన్నకు బీఎస్పీ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రుద్రవరం సునీల్ మాట్లాడుతూ సిని ప్రముఖులకు, మాజీ ఉమ్మడి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలకు అధికారికంగా నిర్వహించినట్లే సాయన్నకు కూడా అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదని అన్నారు. మిగిలిన వారికి ఒక న్యాయం, సాయన్నకు ఒక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. దళిత బంధు, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం కేవలం ఓట్లు దండుకోవడం కోసమేనని ఆ జాతి ప్రయోజనాల కోసం కాదని సాయన్న విషయంలో స్పష్టమైందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఆత్మ గౌరవం దక్కాలంటే బీఎస్పీతోనే సాధ్యమని ఇకనైనా వివిధ పార్టీల్లో ఉన్న బహుజనులు, అగ్రవర్ణ ప్రజాస్వామిక వాదులు బీఎస్పీలోకి రావాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి పిట్ల బాలరాజు, జిల్లా మైనార్టీ కన్వీనర్ ఎల్ డి శ్యాంసన్, జిల్లా మహిళా కన్వీనర్ బండారి రజిత, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంచార్జి రాజేందర్, అధ్యక్షులు జైపాల్ , ఉపాధ్యక్షులు రాజు, ఈసీ మెంబర్ బాబు ఏసన్న, సాయినాథ్, నరేష్, శ్రీశైలం, సునీల్, హృదయ్‌కుమార్, దోరపల్లి రమేష్, చైతన్య సింగ్, సుమలత, నర్సింగరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రేమకు త్యాగం పర్యాయపదం


నాటకంలో దృశ్యం

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: యుయతీ యువకుల మధ్య ప్రేమపెళ్లి వరకు వెళ్ళకపోతే హత్యలు, ఆత్మహత్యలే పరిష్కారం కాదు, ప్రేమకు త్యాగం పర్యాద పదం. ఈ అంశాన్ని వైవిధ్యంగా 'ప్రియ సఖీ' నాటకంలో చెప్పె ప్రయత్నం జరిగింది. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై టిక్కెట్‌పై ప్రతి నెల నాటకం ఉద్యమంగా కొనసాగిస్తున్న ప్రముఖ నాటక సంస్థ రజరంజని నిర్వహణలో శ్రీజయ ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే ప్రియ సఖీ సాంఘిక నాటకం బుధవారం అసక్తికరంగా సాగింది. పంజాబ్ రాష్ట్రం లో జరిగిన కొన్ని వాస్తవ ప్రేమ ఉదంతాలు గ్రహించి డాక్టర్ శ్రీజ సాదునేని రచించి దర్శకత్వం కూడా చేశారు. నటీనటులు శ్రీజ, శశిధర్, అవినాష్, తిరుమలరావు, రమాదేవి, గాయత్రి, తదితరులు పాత్రోచిత నటనతో నాటకాన్ని రక్తి కట్టించారు.

## వెంకయ్యనాయుడు గ్రంథాలు సమర్పణ

సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆచార్య ఎస్.వి. రామారావు భాషా ప్రియులైన మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకటయ్యనాయుడును కలిసి తన గ్రంథాలను సమర్పించుకున్నారు. శత జయంతి సాహితీ మూర్తులు మున్నగు బహు గ్రంథకర్తలు రామారావును వెంకయ్య నాయుడు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### అమరులైన వారిని స్మరించుకోవడం విశేషం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: ఫాస్ ఫిలిం సొసైటీ, బే ఏరియా తెలుగు అసొసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రైడ్ ఆఫ్ ది పబ్లిక్ కె.విశ్వనాథ్, ప్రజానటి జమున, అపరమీరా వాణీజయరామ్, అమర గాయకులు ఘంటసాల వర్ధంతి కార్యక్రమం జరిగినట్లు సొసైటీ అధినేత కె.ధర్మారావు తెలిపారు. బాటా సంస్థ ప్రతినిధి ప్రసాద్ మంగిన నేతృత్వంలో స్థానిక గాయనీమణులు దివంగత సినీ వేల్పు లను గుర్తు చేస్తూ మరుపు రాణి సినీగీతాలను గానం చేశారు.

## ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించాలి: చీకోటి

సైదాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: క్యాసినో రంగంలో ఇటీవల ప్రముఖంగా వినిపిస్తున్న చీకోటి ప్రవీణ్‌కుమార్ ఇంట్లోకి అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించడం కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలోని ఒక అపార్టుమెంటులో చీకోటి ప్రవీణ్ కుటుంబం చాలా ఏళ్లుగా నివాసముంటుంది. గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన క్యాసినో వ్యవహారంలో చీకోటి పేరు ప్రముఖంగా వినిపించింది. ఇటీవల ఆయన ఇంటిపై ఇడి అధికారులు దాడి చేసి సోదాలు నిర్వహించడంతో ఆయన పేరు మరింతగా ప్రచారంలోకి వచ్చింది. ఇదిలా ఉండగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో అయిదారుగురు గుర్తు తెలియని వ్యక్తులు చీకోటి నివసించే అపార్ట్‌మెంటు వద్దకు వచ్చారు. వారిలో ఒక వ్యక్తి గేటులోపలికి వచ్చి మొదటి అంతస్తులోకి రావడానికి నాలుగైదు మెట్లు ఎక్కాడు. అయితే పైకి వెళ్లకుండానే తిరిగి కిందకు వచ్చి కొద్దిసేపు తచ్చాడి పార్కింగ్‌లో ఉన్న టేబుల్ వద్దకు వెళ్లి డ్రాలో ఉన్న చీకోటికి చెందిన రేంజ్‌రోవర్, ఇన్నోవా కారు కీస్ తీసుక ఎన్నాడు. కీ తో రేంజ్‌రోవర్‌ను తీయడానికి ప్రయత్నించి ఆ తర్వాత ఆ ప్రయత్నాన్ని విరమించుకుని గేటు బయటకు వచ్చి రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న చీకోటికి చెందిన ఇన్నోవా కారును తీసుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. అపరిచిత వ్యక్తి హుడి వేసుకుని మొఖం కనబడకుండా జాగ్రత్తపడ్డట్లుగా సిసి కెమరాల రికార్డింగ్‌లో తెలుస్తుంది. కారును దొంగతనం చేయడానికి వచ్చారా లేక పథకం ప్రకారమే ఏదైనా దుశ్చర్యకు పాల్పడడానికి వచ్చారా? పథకంలో భాగంగానే రెక్కీ నిర్వాహించారా? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**యాక్సిడెంట్.. పోలీసుల స్వాధీనంలో కారు, నిందితుడు**

దొంగిలించిన కారులో అందరు కూర్చుని వెళ్లే క్రమంలో ద్విచక్రవాహనదారుడిని ఢీ కొట్టినట్లుగా పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించినట్లుగా తెలుస్తుంది. కాగా దొంగిలించిన కారును ఆదివారం రాత్రే గడ్డిఅన్నారంలో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తుంది. అంతేగాకుండా నిందితుల్లో ఒక వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

**నాకు ప్రాణహాని ఉంది: చీకోటి ప్రవీణ్**

కారును దొంగతనం చేయడానికే తన ఇంటికి అపరిచిత వ్యక్తులు వచ్చారని అనుకోవడం లేదని చీకోటి ప్రవీణ్ కుమార్ అన్నారు. అణువణువునా సిసి కెమరాలు ఉన్న నగరంలో కార్ల దొంగతనం జరిగే ఛాన్స్ లేదని, ఈ సంఘటన తనకు వార్నింగ్ ఇచ్చినట్లుగా కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. కారు దొంగతనం గురించి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. గతంలో కూడా తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని, తన ఇంటి ముందు అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## న్యాయవాది సురేందర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదుల డిమాండ్**


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా న్యాయవాది నారపాక సురేందర్ పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం న్యాయవాది సురేందర్ పై జరిగిన దాడిని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల పై ఇటీవల దాడులు పెరిగిపోయాయని, న్యాయవాదులపై దాడులను అరికట్టాలంటే న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని కోరారు. గతంలో 1992, 93లో ఇద్దరు న్యాయవాదులపై దాడి జరిగితే నిరసన తెలిపిన హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా న్యాయవాదులపై పోలీసులు లాఠీ చార్జి చేశారని, దీనిని నిరసిస్తూ అరవై రోజులు న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారని గుర్తు చేశారు. ఇటీవల న్యాయవాదులపై దాడి జరిగితే కొందరు న్యాయవాదులు మాత్రమే స్పందించి, నిరసన తెలుపుతున్నామని, కొందరు న్యాయవాదులు కోర్టుకు రానవసరం లేదని భావిస్తున్నారు తప్ప దాడులపై సరియైన రీతిలో స్పందించటం లేదని అన్నారు. సమాజానికి మేలు చేసే న్యాయవాదులపై దాడులు చేయటం అమానుషమని, దీనిని తెలంగాణ న్యాయవాదులుగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యఓఉలు గుర్రం సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం దేవరరాజుగౌడ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడ్యారపు రవికుమార్, ఆల్ ఇండియ లాయర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మోతుకూరి వనజ, ఉపాధ్యక్షులు కందుకూరి నరసింహాచారి, తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలి


మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన జి.జి.వై.ఎఫ్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: గోషామహల్ డివిజన్ పరిధిలోని మర్కస్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయించాలని స్థానిక ప్రజలు కోరారు. గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి విన్నవించారు. అందుకు ఆయన స్పందించి సిసి కెమెరాలను ఏర్పాటు చేయించేందుకుగాను హామి ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బస్తీవాసులు అశోక్, నర్సింగ్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళ మృతి

దుండిగల్, ఫిబ్రవరి22 ప్రభాతవార్త: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ గ్రామానికి చెందిన సత్యలక్ష్మీ(60) మధ్యాహ్నం 2గంటల సమయంలో భౌరంపేట్ నుంచి సూరారం వెళ్ళేందుకు ఆటోలో బయలు దేరింది. అయితే గండిమైసమ్మ చౌరస్తా వద్దకు రాగానే ఆటో దిగి సూరారం వైపు వెళ్ళేందుకు రోడ్డు దాటుతుండగా మియాపూర్ నుంచి నర్సాపుర్ వెళ్తున్న టీఎస్35టీ1166 నెంబర్‌తో ఉన్న లారీ అతివేగంగా దూసుకొచ్చి సత్యలక్ష్మీని ఢీకొట్టింది. లారీ ఢీకొట్టిన వేగానికి సత్యలక్ష్మీ రెండు చక్రాల కిందపడడంతో తలకు బలమైన గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## అర్ధరాత్రి అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వవిప్


కాలనీలో పర్యటిస్తున్న పనులను పరిశీలిస్తున్న గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రాహిల్స్ కాలనీలో 35లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ అర్ధరాత్రి ఆకస్మికంగా వెళ్ళి తెల్లవారుజాము వరకు అక్కడే ఉండి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ మార్గదర్శకంలో మంత్రి కెటిఆర్ సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇంద్రాహిల్స్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమని, ఆదిత్య నగర్ దశదిశను మార్చామని, ఇంద్రాహిల్స్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌నాయక్, రాందేవ్‌రాథోడ్, రామారావు, ప్రసాద్, శ్యామ్, బండారు శంకర్, శ్రీను, ఓబులేశ్, విక్రమ్, విఠల్, రాజు, రంజిత్, వెంకటేష్, కృష్ణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ పుస్తక విశ్లేషణ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త : ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ పుస్తక విశ్లేషణ కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నట్లు ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల గోపాలరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. గురువారం ఉదయం 11 గంటలకు నగరంలోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నా మాటల మూట పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ పాత్రికేయులు సమాచారహక్కు చట్టం మాజీ కమీషనర్ దిలీప్‌రెడ్డి, ఎన్టీవీ సిఈఓ చీఫ్ ఎడిటర్ రాజశేఖర్, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ పద్యకవి డాక్టర్ రాధాశ్రీ, లోక్‌సత్తా సామాజిక కార్యకర్త రవీంద్ర, ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## రిటైర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జి.దామోదర్‌రెడ్డి



అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా దామోదర్‌రెడ్డి ఎన్నికయ్యారు. రెండు రోజుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు బుధవారం రెడ్డిహాస్టల్‌లో ముగిసాయి. అధ్యక్ష పదవి ఎన్నికల్లో దామోదర్‌రెడ్డి 540ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించినట్లు సెక్రటరీ జనరల్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. మిగతా కార్యనిర్వాహక పదవులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా చెప్పారు. ఈ సమావేశంలో పెన్షనర్లకు సంబంధించిన ధీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలపై సమగ్రంగా చర్చించి పలు తీర్మానాలు ఏమోదించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీ ప్రకటించిన విధంగా ఈహెచ్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న ట్రస్ట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో అమలు చేస్తూ ట్రస్ట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, సంఘాలతోపాటు టిఎస్ జిఆర్ఇఎ సంఘ ప్రతినిధులను సభ్యులుగా చేర్చాలని కోరారు. ప్రతినెల ఒకటవ తేదిన పెన్షన్ చెల్లించాలని, టిఎస్‌జిఆర్ఇఎకు ప్రభుత్వ గుర్తింపు కల్పిస్తూ ఉత్తర్వులను జారీచేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ రెగ్యులర్ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. అసోసియేట్ అధ్యక్షులుగా వి.విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా జి.మోహన్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, పి.ఆర్.మో హన్‌రెడ్డి, పి.ఆర్.మోహన్, పి.శ్రీహరిరెడ్డి, ఆర్.సీతారామయ్య, వి.భాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా పి.శ్యామ్‌రావు, టి.ప్రభాకర్, ఎన్.విష్ణు వర్ధన్‌రెడ్డి, శరత్‌బాబు, ఎ.బి.విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.బక్కారెడ్డి, పి.నాగేశ్వరరావు, ఎ.లక్ష్మినరసింహారావు, కోశాధికారి ఎ.గంగారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా చందులాల్, శ్రీవత్సవ్, ఎం.రవీందర్‌రెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, పి.పెంటయ్య, ప్రచార కార్యదర్శి బి.ప్రహ్లాద్‌రావులను ఎన్నుకున్నారు.

## రికాబ్‌గంజ్‌లో అన్నదాన కార్యక్రమం



చార్మినార్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో కుంభమేళ అగర్వాల్ బంధు అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు ఫంకజ్ కుమార్ అగర్వాల్, రవీంద్ర నాధ్ నార్‌నౌలా, సురేంద్ర నార్‌నౌలా, శ్రీనివాస్, ధీరజ్, రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తెలంగాణ సిల్క్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రీన్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలు

చార్మినార్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాల, తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ సిటీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.బాల భాస్కర్ అధ్యక్షతన గ్రీన్ సెక్టార్‌లో స్థిరమైన జీవనోపాధి కోసం ఐబిఎం బిల్డ్ ఎంప్లాయ్‌మెంట్ లింక్ ట్రైనింగ్ కార్యక్రమంపై ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ప్రోగ్రామ్ మేనేజర్ రామకృష్ణ, సంహిత, జి.శ్రీనాథ్ రెడ్డిలు గ్రీన్ సెక్టార్‌లో శిక్షణ, ఉపాధి అవకా శాలు గురించి విద్యార్థులకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌కెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఘౌస్సీ రాణి, టిఎస్‌కెసి మెంటర్ జి.సంతోష్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

సంక్షిప్త టెండరు ప్రకటన నెం. Engg-34/PTC-C-22/2022-23 తేదీ: 21.02.2023
నిట్ నెం. Engg-34/PTC-C-22/2022-23, తేదీ: 21.02.2023, పనిపేరు: GHMC, SLP జోన్, సర్కిల్-22, భారతీనగర్ వార్డ్ నెం.111, LIG కాలనీ, యందు వార్డు కార్యాలయ భవనంలో మిగులు పనిని నిర్వహించుట 1 నెం. అంచనా విలువ/ECV: రూ. 49.60 లక్షలు. డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 22.02.2023న ఉ.10.30గం.ల.కు. బిడ్‌ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 28.02.2023న మ.3.00గం.ల.కు. EE పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్ నెం. 8978026758. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, SLP జోన్, GHMC.
DIPR.No.12752-PP/CL/Advt/1/2022-23 తేదీ: 22.02.2023



IN THE COURT OF THE DISTRICT & SESSIONS JUDGE RANGAREDDY DISTRICT AT L.B.NAGAR
I.A.NO.389 OF 2021
IN
O.P.NO.501 OF 2012

Between :
Smt.Banala Bhagyamma .....Petitioner/Petitioner
AND
V.Madhava Reddy and another ...Respondents/Respondents

To,
V.Madhava Reddy, S/o. V.Malla Reddy, Aged: Major, Occ: Business, R/o.H.No.3-65, Plot No.3, Peerjadiguda, Uppal Mandal, Rangareddy District.

Please take Notice that the Plaintiffs has filed the above case for the petitioner seeking the compensation against the Respondent No.1 who is the owner of the crime vehicle and the Hon'ble Court directed to issue Notice in daily News Paper i.e. Vartha Daily News Paper. The above said case is posted for on 24-02-2023 for your appearance and counter, if any. Therefore you are hereby directed to make it convenient to appear either in person or through duly instructed agent/ pleader on the said date at 10.30A.M. before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter in your absence.

//BY ORDER OF THE COURT//
Sd/- M/s.S.P.LAW CONSULTANCY
Srinivas Pendota & Associates
Advocates
Shop.No.31, Rajanigandha Complex, Ground Floor, Kamala Nagar, Chaitanyapuri, Hyderabad-500 060,
Cell No.9391046702, 9618218668.
E-Mail : pendota.srinivas1972@gmail.com
COUNSEL FOR PETITIONER



IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT. AT: HAYATHNAGAR.
O.S.NO. 248 OF 2021.

Between :
Bondalapati Subhadra & others .....Plaintiffs
AND
Vishnu Bhotala Venkatachala Somayajulu ... Defendant

To
Vishnu Bhotala Venkatachala Somayajulu, S/o.Late V.V.Subramanyam, Occ: Retd. Employee, Aged about 59 Years, R/o.8-87/1, New Dilsukhnagar, Hyderabad, T.S. ... DEFENDANT

Please take notice that the Plaintiffs have filed the above suit against you for Specific Performance. The above suit is posted to 16-03-2023. You are hereby summoned to appear before the Hon'ble Court on 16-03-2023, at about 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

SCHEDULE OF THE PROPERTY
ALL that piece and parcel of the open land bearing Plot No.441, admeasuring 376 Sq.Yards, or 314.37 Sq. Mtrs., in Survey Nos.7, 8, 9, 10, 11, 12/A, 12/1A, !2/c and 12/12E, Situated at Piglipur Village and Gram Panchayat, erstwhile under Hayathnagar Mandal, Presently under Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District and bounded by: NORTH: 25' Wide Road, SOUTH: Neighbour's, EAST : Plots No.439 and 440,WEST :Plot No.442.

(BY ORDER OF THE COURT)
M/s.HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
Hayathnagar,Dt: 20-02-2023
COUNSEL FOR THE PETITIONERS.



IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE cum IV ADDL. METROPOLITAN MAGISTRATE MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT L.B NAGAR.
O.S. No.130 OF 2023

Between:
1. Smt. Racherla Anuradha, W/o.Racherla Narendhar Babu,
2. Smt. Danalkoti Anitha, W/o. Danalkoti Ramesh ...Petitioners/Plaintiffs
AND
1. The Tahsildar Medipally, Medchal-Malkajgiri District.
2. All Concern ...Respondents/Defandants

PUBLIC NOTICE
It is informed to all the general public that my client Smt Racherla Anuradha & her Sister filled a suit for declaration of owners of suit schedule property as legal heirs & successors of their Late father deceased Late Nampally Shankar Rao, S/o. Late Nampally Balaiah (owner of) the property bearing Plot No.11/Part covered by Sy.No.98/Part & 99 admeasuring 56 Sq.Yards equivalent to 46.81 Sq.Metres constructed with ACC rooms vide Municipal Door No.10-102/10/2 situated Rama Krishna Nagar Peerzadiguda Village & Panchayat Ghatkesar Mandal Old Ranga Reddy District, Telangana.
If anyone has any share, claim, right, interest, title, lien will need to approach the Hon'ble Court at L.B Nagar by 10-30 am, on 24-03-2023 from the date of this notice.
SCHEDULE OF PROPERTY: All that property bearing Plot No.11/Part covered by Sy.No.98/Part & 99 admeasuring 56 Sq.Yards equivalent to 46.81 Sq.Metres constructed with ACC rooms vide Municipal Door No.10-102/10/2 situated Rama Krishna Nagar Peerzadiguda Village & Panchayat Ghatkesar Mandal Old Ranga Reddy District, Telangana and bounded by: North: Plot No.11/Part, South: Plot No.10, East : Survey No.100 & 101, West : 25' Wide Road.

(By Order of the Court)
KUNCHALA SRINIVAS, B.Com., LLM
ANKUSHAM SREENIVAS, B.Sc. LLB
ADVOCATES,
Sri Sai Nagar Colony Nagole, Medchal-Malkajgiri District, Hyd-500068.



PUBLIC NOTICE
The General Public is hereby informed that my client a reputed Home Finance Company decided to grant loan to M/s. Shiva Sai Kirana & General Store represented by Bandela Anjaneyulu S/o B. Narasimha, aged about 42 years, Occ: Business, R/o H.No.1-84A2, Plot No.4, Deshmukhi Village, Bhoodan Pochampally Mandal, Yadadri Bhuvanagiri District, on his approaching my client claiming himself as the owner of below mentioned schedule of property registered as Sale Deed Doc.No.4053/2022 executed and registered by Bandela Narsimha in his name (Bandela Anjaneyulu) on 12.05.2022 before SRO, Bibinagar. Bandela Anjaneyulu informed that there is no link document for the said Sale Deed. Any person/s, Financial Institutions, Banks having right, title, objections or claims in respect of the schedule of property shall submit their claims within 7 days from the date of publication to the undersigned along with documentary evidence proof and no claims shall be entertained thereafter.

SCHEDULE OF PROPERTY
All that the House No.1-91/10/Part (Assessment No.123), admeasuring an extent of 230 Sq.yds, or equivalent to 192.28 Sq.Mtrs., situated at Rudravelly Village, Bibinagar Mandal, Yadadri Bhongir District, Regn. Sub-Dist. Bibinagar, Regn. Dist. Nalgonda, G.P. Rudravelly and Bounded by: North: 12' Wide Road, South: 10' Wide Road, East: H.No.1-91/10/Part, West: Open Place of Gandu Narsimha.

Sd/- Dr. C.S. CHAKRAVARTHY
Advocate
Chamber at Ground Floor, H.No. 16-11-16/T/4, Master's Nilayam, West Prashanth Nagar, Moosarambagh, Hyderabad-500036. Telangana State, Cell No.9391046708, 7901240898, 40-35888927



PUBLIC NOTICE
The General Public are hereby informed that my client Smt. Radhaben Patel, W/o. Chandulal Patel, Aged about 47 years. Occ: Housewife. R/o. H.No.3-2-134/1, Road No.5, Shathavahana Nagar. Near Little Flower High School. L.B.Nagar, Hyderabad - 500 074 (Aadhar No.6687 0412 6329) was in the custody of the original Registered Documents in respect of Plot No.23. admeasuring 182 Sq.yards. in Sy.No.49/4, situated at Bahadurguda (Dhanapuram) Village, Saroornagar Mandal, Ranga Reddy District, with the boundaries NORTH-Neighbours. SOUTH-20' feet wide Road. EAST-Neighbour's. WEST-15' feet wide Road and on 20-02-2023 she was lost the Original Registered Sale Deed bearing document No. 134/2000 Dated 13-01-2000 (which stands on the name of my client and her mother-in-law namely Smt.Heera Ben Patel) while she was going to get Xerox Copy of the said document near S.B.H. at L.B.Nagar containing Plastic Cover and to that effect my client also taking steps to lodge complaint before police officials through mee-seva.
If any person or person(s) who came across the custody of the above said Original Registered Documents be pleased to hand-over to the undersigned or to my client.

Sd/- K.Harish Reddy
Advocate
# 3-12-74/16, Behind Karuru Vysya Bank, GSI Post, Mansurabad. L.B.Nagar, Hyderabad-068
Ph.No.98492 96949



IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE CUM METROPOLITAN MAGISTRATE : RANGA REDDY DISTRICT AT : LB NAGAR
O.S. No. 1391 of 2022

Between:
1. Periketi Satyanarayana Achary, S/o Periketi Shankaraiah
2. Periketi Jhansirani, D/o Periketi Satyanarayana Chary, Borth are R/o 16-2-783, Sri Durga Devi Ladies Tailor, Sankeshwar Bazar, Saidabad, Hyderabad, Telangana-500056. ...Plaintiffs
And
1. The Mandal Revenue Officer, Balapur Revenue Mandal, Ranga Reddy District.
2. All Concerned. ....Defendants

To,
All Concerned,
Please take notice that the plaintiffs has filed the above case for declaration of legal heirs and declaring them as they are the legal heirs late deceased Smt. P. Govindamma below mentioned schedule of property. The above said case is posted for on 13.03.2023 for your appearance and counter, if any.
Therefore you are hereby directed to make it convenient to appear either in person or through duly instructed agent/pleader on the said date at 10.30 A.M. before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter in your absence.
SCHEDULE OF PROPERTY: All that piece and parcel of the Flat No.G-2 of H.No.14-82/3/G2 (PTIN No.II95008332) in Ground Floor, with a Built-Up Area of 739 Sq.Feet (Including Common Areas along with Car Parking), along with an undivided share of land admeasuring 22.57 Sq.Yards or equivalent to 18.87 Sq.Mtrs., (Out of 333.5 Sq.Yards), Residential Building Known as "Sri Sai Teja Residency" on Plot No.72, in Survey No.23, admeasuring 333.5 Sq.Yards or 278.83 Sq.Mtrs, situated at R.N.Reddy Nagar of Meerpet Village, Balapur Revenue Mandal, Ranga Reddy District, Under Meerpet Municipal Corporation, Registration Sub-District, L.B.Nagar and Bounded by: Boundaries for Flat No.G-2, North: Corridor. South: Open Space. East: Open Space, West: Flat No.G-3, Boundaries for Entire Land: North: 30' Wide Road. South: Plot No.73, East: 25' Wide Road, West: Plot No.71.

//BY ORDER OF THE COURT//
Sd/- M/s. S.P. LAW CONSULTANCY
SRINIVAS PENDOTA & ASSOCIATES
ADVOCATES
Counsel for Plaintiff



COURT NOTICE
IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
G.W.O.P.No. 2 OF 2023

Between:
Smt. P. Laxmi & another ...Petitioners
AND
P. Sunitha and others ...Respondents

To,
ALL CONCERNED ...Respondent No.3

Please take notice that the above Petitioners have filed the above G.W.O.P.No. 2 OF 2023 against the Respondents to permit the Petitioner No.1 namely Smt. P. Laxmi, W/o. Late P. Radheshyam to sell the 2/12 share of the Petitioners No. 2 and 3 in Petition Schedule Property as their Mother/Natural Guardian of the Petitioners No. 2 and 3. If anybody having any objections appear before the Hon'ble Court on 23/03/2023 at 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided in your absence and will be heard exparte.

(By Order of the Court)
Sd/- P. RAMCHANDER,
Advocate,
Off: Flat No.B, 1st Floor, Chiranjeevi Apts., Block No.I, West Marredpally, Secunderabad-26.
Cell: 9246537118



IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT :: AT. L.B.NAGAR
G.W.O.P No. 8 OF 2023

BETWEEN:
Sri. Narsimha Reddy ....Petitioner
AND
All concerned. ...Respondents

COURT NOTICE
To,
All Concerned.
Please take notice that the above named Petitioner viz. Sri. Narsimha Reddy has filed the above Petition under Section 8(2) of Hindu Minority and Guardianship Act, 1956 R/w. Section 29 of Guardians & Wards Act,seeking permission to alienate the petition schedule properties standing on the name of minor child viz. G. Anish Sai Reddy,against you in general and the above case is posted on 16.03.2023. If anyone has any objections are requested to make their appearance on 16.03.2023 at 10.30 am with material evidence in person or through counsel before the HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, R.R. DISTRICT AT. L.B.NAGAR, otherwise the matter will be heard and decided in accordance with law.

SCHEDULE "A" PROPERTY
All that piece and parcel of Open Land bearing Plot No.136, admeasuring 200 Sq.Yards, or 167.22 Sq.Mtrs., in Survey No.207, Situated at NADERGUL VILLAGE, Saroornagar Revenue Mandal, Ranga Reddy District, Under Badangpet Nagar Panchayat, Registration District Registrar, L.B.Nagar, Ranga Reddy (East) District and bounded by:- NORTH : Plot No.135; SOUTH : 25' Wide Road; EAST : Plot No. 145; WEST: 25' Wide Road.

SCHEDULE "B" PROPERTY
All that piece and parcel of Open Land bearing Plot No.137, admeasuring 200 Sq. Yards, or 167.22 Sq.Mtrs., in Survey No.207, Situated at NADERGUL VILLAGE, Saroornagar Revenue Mandal, Ranga Reddy District, Under Badangpet Nagar Panchayat, Registration District Registrar, L.B.Nagar, Ranga Reddy (East) District and bounded by:- NORTH : 25' Wide Road; SOUTH: Plot No.138; EAST: Plot No.144; WEST: 25' Wide Road.

(BY THE ORDER OF THE COURT)
M/s. M. N. AKSHARA REDDY & ASSOCIATES
Counsel for Petitioner
Mobile No: 9100918668



PUBLIC NOTICE
General Public are here by informed that SMT.ANNIE SYLVIA BONAL W/o. HARRY ELIAS ANNY DONAL Flat Bearing No.105, in fir st floor,in the building known as ANAND ARCADE with built up areas 855 Sq.Ft., Including common areas with Scooter Parking, togetner with an undivided share of land 33.33 Sq.Yards or 27.86 Sq. Meters out of 200 Sq.Yards, Constructed on Plot No:34, in Survey No:157/8, Situated at A.P.Text Book Colony, Gunrock Enclave, Thokatta Village, Secunderabad, Cantonment, Hyderabad District, Telangana State. If anybody has or have any objection for mutation in the name of SMT. ANNIE SYLVIA DONAL W/o HARRY ELIAS ANNY DONAL in the Tax Records my contact the Executive Officer, Secunderabad Cantonment Board within a period of 30 days from the date of Publication of this Notice, failing which Mutation shall be accordingly ordered.

Sd/-CHIEF EXECUTIVE OFFICER
SECUNDERABAD CANTONMENT.
Ph.No.9490611173/89
Address:
Office of the Cantonment Board, Court House Compound, Sardar Patel Road, Secunderabad-500003.

## కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులను సహించం : పారిజాత



సిఎం దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో పాల్గొన్న పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హెచ్చరించారు. వరంగల్ జిల్లాలో యూత్ కాంగ్రెస్ కార్యకర్త తోట పవన్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం బడంగ్‌పేట్‌లో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మను దహనం చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హాజరైన మేయర్ మాట్లాడుతూ వరంగల్‌లో ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అనుచరులు యువజన కాంగ్రెస్ కార్యకర్తపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ మేరకు నైతిక బాధ్యత వహిస్తూ వినయ్ భాస్కర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పోలీసులు దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు చేస్తే ప్రజలు సహించరనీ గద్దె దింపుతారని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, నాయకులు నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, బంగారి అశోక్, గొరిగె శ్రీశైలం, పుట్టగళ్ళ జగన్, తూళ్ళ నరహరిగౌడ్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమృతానాయుడు, తూళ్ళ సునీతగౌడ్, పెద్దబావి మౌనికా దర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, ఎన్ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి నుండి రూ. 2లక్షల ఎల్ఓసి అందజేత



మంత్రి మల్లారెడ్డి ఎల్ఓసిని అందిస్తున్న కార్పొరేటర్ లావణ్య

**జవహర్‌నగర్ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** పేదలకు సీఎం సహాయనిధి ఎల్ఓసి ఓ వరం లాంటిదని మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ జవహర్ నగర్‌లో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సావిత్రి అసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ. 2లక్షల ఎల్ఓసిని స్థానిక కార్పొరేటర్ బింగి లావణ్యకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలోనే పేదలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. పేదల బ్రతుకుల్లో వెలుగులు నింపే మంచి మనసున్న మహరాజుగా సీఎం కేసీఆర్ పేరు సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేయర్ మేకల కావ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** సిఎం సహాయనిధి నిరుపేదలకువరమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేటలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సిఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను పలువురు లబ్దిదారులకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి తోడ్పడుతుందన్నారు. సిఎం సహాయనిధి నిరుపేదలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల బెడద నివారించాలి: పవన్



రిషి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కార్పొరేటర్ పవన్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి నిర్లక్ష్య ధోరణి కారణంగానే బాలుడు రిషిపై కుక్కలు దాడి చేశాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆరోపించారు. మారుతినగర్‌కు చెందిన రిషిపై కుక్కలు దాడి చేయడంతో బుధవారం కార్పొరేటర్ బాలుడి గాయాలను పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కుక్కలు ఇక్కడ చేరుతున్నాయని వాటిని నివారించడంలో జిహెచ్ఎంసి వైఫల్యం చెందిందన్నారు. నివాసాల ముందు ఆహార పదార్థాలు పెట్టడం వల్ల కుక్కలు గుంపులుగా చేరుతున్నాయని దీంతో చిన్నారులు మహిళలపై కుక్కలు దాడులు చేసి గాయపరుస్తున్నాయని అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

## బస్తీవాసులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు : లచ్చిరెడ్డి



సిసి రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ బతుకమ్మ కుంటలో జరుగుతున్న సిసిరోడ్ పనుల్లో ఇబ్బందులున్నాయని బస్తీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సమాచారం అందజేశారు. దీంతో కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఎఇ రాకేష్‌తో కలిసి ఆ రోడ్డును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారమయ్యేవిధంగా కృషిచేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బస్తీవాసులు సత్యనారాయణ, కృష్ణా, రాజు, జగన్మోహన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు నిరుపేదలకు వరం : ఎమ్మెల్యే బేతి



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేతి, శ్రీవాణి

**రామంతాపూర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కంటి వెలుగు పథకం ద్వారా నిరుపేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు, వారికి కంటి అద్దాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం పేదలకోసం తమ వంతు చేయూత అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సౌందర్యలత, డా.వైశాలి, సూపర్ వైజర్ బోగ ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, సూరం శంకర్, జెసిబి రాజు, జానకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో శివలింగ, నంది విగ్రహాల ప్రతిష్ట



శివలింగ, నంది విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్న రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని సాయిబాబా మందిరంలో శివలింగ, నంది విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్, పోచమ్మ ఆలయం మాజీ ఛైర్మన్ పిటి శంకర్ ముదిరాజ్, చీపురు రాజుగౌడ్, మదన్, ద్వారక, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడి కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలి : రాధ

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి మరణించిన అంబర్‌పేటకు చెందిన బాలుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని జిహెచ్ఎంసి బిజెపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ రాధాధీరజ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఫ్లోర్‌లీడర్ శంకర్‌యాదవ్,ఇతర డిప్యూటీ ఫ్లోర్‌లీడర్స్, కార్పొరేటర్స్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కల బెడద నగరంలో తీవ్రరూపం దాలుస్తున్నప్పటికీ జిహెచ్ఎంసి ఎందుకు పట్టించుకోవడం లేదని, మృతి చెందిన బాలుడు ప్రదీప్ కుటుంబానికి నష్టపరిహారం అందజేయాలని, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల పనితీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు అంటే బిఆర్ఎస్ ప్రభుత్వానికి లెక్కలేదా అని ప్రశ్నించారు.

## ఘనంగా కొనసాగుతున్న తృతీయ బ్రహ్మోత్సవాలు

**సైదాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** అనుపమ నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి సహిత గణపతి, సూర్య,అంబిక, భవాని శంకర దేవాలయం తృతీయ బ్రహ్మోత్సవాలను 2వ రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, అమ్మ వారికి అభిషేకము, చండీహోమం, మండప పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ కుడుముల వెంకట్‌రెడ్డి స్వర్ణలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో భద్రావతి, నాగమణి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జైపురి కాలనీలో కుక్కల బెడద

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కాలనీలో గుంపులుగా కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని నాగోల్ డివిజన్ జైపూర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరివంశరాజ్ పేర్కొన్నారు. కాలనీలో కుక్కల బెడదను అరికట్టాలని కోరుతూ బుధవారం హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ మారుతిదివాకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీలో అనేకసార్లు చిన్నారులపై కుక్కలు దాడి చేసిగాయపరిచాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. అంబర్‌పేటలో జరిగిన కుక్కలదాడిలో ఓ చిన్నారి మృతి చెందినప్పటికీ అధికారులు కళ్ళు తెరవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## జీ.ఓ.118లో కొన్ని సవరణలపై చర్చలు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



జిఓ నం. 118పై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** దశాబ్దాల కాలంగా రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్యలపై మంత్రి కేటీఆర్ జీ.ఓ.118 ప్రకారం రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించామని తెలిపారు. ఈ జీ.ఓ.118లో కొన్ని సవరణలుచేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌తో కలిసి చర్చించారు. ఓపెన్‌ప్లాట్స్ ఉన్నవాళ్ళకు, నోటరీ ప్లాట్స్ ఉన్న వాళ్లకు అలానే వాటిలో ఇల్లు కొన్నవాళ్లకి, విదేశాల్లో ఉన్న వాళ్ళు కూడా ఆన్‌లైన్‌లో వారి బంధువులద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అనుమతివ్వాలని కోరారు. లీగలైజేషన్ ఉన్నవాళ్ళు కూడా సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వడానికి ఆప్షన్ ఇవ్వాలని వారితో కలిసి వివరించడం జరిగింది. త్వరలోనే సంబంధిత రెవెన్యూ అధికారులు ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తారని, ఆ సమయంలో సరైన పత్రాలు చూపెట్టాలని కోరారు.

## బిజెపి అధికారంలోకి వస్తే మెరుగైన ప్రజా సంక్షేమం



శక్తి కేంద్రం సమావేశంలో ప్రసంగిస్తున్న వీరేందర్‌గౌడ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమంలో భాగంగా బిజెపి శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ సమావేశానికి రాష్ట్రఅధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కెసిఆర్‌పాలనలో పేదల సంక్షేమం కుంటుపడిందని ఆరోపించారు. పేదలకు పక్కా ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని విమర్శించారు. కెసిఆర్ మాత్రం వంద పడకల ప్రగతి భవన్‌లో సుఖంగా ఉన్నాడని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు రెండు పడకల ఇళ్ళ నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తుందని హామీనిచ్చారు. అదేవిధంగా ఉచిత విద్య, వైద్యం అందిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కోడూరు సోమేశ్వర్, శక్తి కేంద్రం ఇంఛార్జి వరికుప్పల బుచ్చిరాములు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాతగౌడ్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి అమలు చేయాలని ఆర్టిజన్ కార్మికుల ధర్నా



హబ్సిగూడ విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యుత్ అర్టిజన్ ఉద్యోగులు, కార్మికులు

**ఉప్పల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** విద్యుత్ అర్టిజన్ ఉద్యోగులకు పిఆర్‌సి అమలుచేయాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌ఆధ్వర్యంలో బుధవారం హబ్సిగూడ ఎస్ఇ కార్యాలయం ముందు లంచ్ అవర్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కొత్త బచా, రంగు జానయ్య, సర్కిల్ అధ్యక్షుడు బి.సిద్దులు, కార్యదర్శి ఆర్.ఉపేందర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యుత్ అర్టిజన్‌ల సమస్యలను యజమాన్యం పట్టించుకోవడంలేదని,కార్మికులకు పిఆర్‌సి ఇవ్వలేదని, విలీన ప్రక్రియ జరిగి ఐదేళ్లవుతున్నా కన్వర్షన్ ఇవ్వడం లేదన్నారు. స్టాడింగ్‌రూల్స్ రద్దుచేసి ఎపిఎస్ఇబిరూల్ ఇవ్వాలని కోరారు. ఒకే సంస్థలో ఒకే రూల్ ఉండాలని డిమాండ్ చేశారు. సమస్యలపై స్పందించకపోతే కార్పొరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం నేతలు బి.శ్రీను, పి.మోహన్‌రావు, బాబు, చైతన్య, రవి, నరేష్, బాలరాజు, అంజనేయులు, విజయ్‌కుమార్, అనిత, సరిత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీకి వచ్చిన దొంగ హత్య



చోరీకి వచ్చిన దొంగ హత్యకు గురైన దృశ్యం

**కుషాయిగూడ, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** కుషాయిగూడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగతనానికి వచ్చిన ఓ దుండగుడు వాచ్‌మెన్ చేతిలో హత్యకు గురైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ శ్రీ వేంకటేశ్వర స్వామి పద్మావతి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి తెల్లవారుజామున బుధవారం ఉదయం సమయంలో ఆలయంలో చోరీకి వచ్చిన దుండగుల్ని అడ్డుకోవడానికి ఆలయ వాచ్‌మెన్ ప్రయత్నించగా వాచ్‌మెన్‌పై రాళ్లతో దాడికి దిగి హత్య చేసే ప్రయత్నం చేయగా తన ప్రాణ రక్షణ కోసం వాచ్‌మెన్ సదరు దుండగుడిపై కర్రతో అడ్డుకోగా ఈ ప్రయత్నంలో దుండగుడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగులపై వాచ్‌మెన్ తన ప్రాణరక్షణ కోసం మాత్రమే తిరుగుబాటు చేయడం జరిగిందని ఈ క్రమంలో హత్యకు గురైన దుండగుడి విషయంలో వాచ్‌మెన్‌కు శిక్ష పడకుండా చూడాలని పలువురు భక్తులు స్థానికులు కోరుతున్నారు.

## బాలుడి మరణంపై మేయర్ విజయలక్ష్మి మొసలి కన్నీరు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కుక్కల దాడిలో బాలుడు మరణిస్తే నగర మేయర్ విజయలక్ష్మి మొసలి కన్నీరు కారుస్తున్నారని డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ కుమార్ ఎద్దేవా చేశారు. అంబర్‌పేట్‌లో వీధికుక్కల దాడిలో బాలుడు చనిపోయిన సంఘటన మీద మేయర్ విజయలక్ష్మి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశంలో ఎన్నోసార్లు ఈసమస్యల గురించి మాట్లాడిన పట్టించుకోని మేయర్ ఇప్పుడు అందరి అభిప్రాయాలను తీసుకుంటామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిహెచ్ఎంసి వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడే సమస్యలు గుర్తుకు వస్తాయని ప్రశ్నించారు. కుక్కల బెడదను నివారించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం : మేయర్ కావ్య, కార్పొరేటర్ మురుగేష్



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ మేయర్ మేకల కావ్యతో కలసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మురుగేష్

**జవహర్‌నగర్ ఫిబ్రవరి22 ప్రభాతవార్త:** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ మురుగేష్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని న్యూ అంబేద్కర్ నగర్‌లో నూతనంగా భూగర్భ డ్రైనేజీ పనులను మున్సిపల్ మేయర్ మేకల కావ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో లావణ్య, సింగన్న, బాలరాజ్, బి.బాల్‌రాజ్, రాజు,క్రిష్ణ, డాక్టర్ చంద్రమౌళి, యాదగిరి, పృధ్వి, సంతోష్, మహిళా నాయకురాళ్ళు ధనలక్ష్మి, యాకమ్మ, మహేశ్వరి, మల్లమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికులు

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల 29 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూతెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్82 ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ముందు విద్యుత్ కార్మికులు కార్మికులు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికుల వేతన సవరణ చేపట్టడడంతో పాటు పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అపరిష్కృతంగా ఉన్న 29 డిమాండ్లను పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ నాయకులు ఉపేందర్, పెద్దులు, శివారెడ్డి, రాజు, శ్రావణ్, శ్రీకాంత్‌రెడ్డి, జయసుధన్‌రెడ్డి, మేకల ప్రవీణ్, హరీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రావు, హెచ్82 నాయకులు పాల్గొన్నారు.

## నేడు చంపాపేటలో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం

**మలక్‌పేట, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** చంపాపేటలోని ఎస్‌పిజి గ్రాండ్ బ్యాంక్వెట్ హాల్‌లో గురువారం ఉదయం బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు భాగ్యనగర్ జిల్లాఅధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. శక్తి కేంద్ర ఇంఛార్జిలు బిజెపి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా ఆఫీస్, 7 మోర్చ జిల్లా బేరర్స్, రాష్ట్ర నాయకులు తదితరులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## జల్‌పల్లి ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపిఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో బుధవారం ఆయన స్థానిక బిజెపి నేతలతో కలిసి పర్యటించి జల్‌పల్లి గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతంలో డ్రైనేజీ పొంగి ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తుంటే అధికారులు, పాలకులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఆయన కమీషనర్‌కు ఫోన్ చేసి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు తీరకపోతే మంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొరిగె మల్లేష్, దిలీప్, హరికృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, మురళి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి బిఎల్‌ఆర్ ట్రస్ట్ చేయూత

**ఉప్పల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** ఉప్పల్ న్యూశాంతినగర్‌లో నివసిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన భాస్కర్ కుటుంబ సభ్యులకు బిఎల్‌ఆర్ ట్రస్ట్ చేయూత అందించింది. ఈ మేరకు బుధవారం బిఎల్‌ఆర్ ట్రస్ట్ నాయకులు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్, బాషపల్లి నిరంజన్‌చారి, సత్యరాజ్‌గౌడ్, శామీర్‌పేట వినోద్‌రెడ్డి, ఏమాండ్ల రాంరెడ్డి, మస్తాన్, అల్వాల్ నాగరాజు, రావుల నవీన్‌గౌడ్, రోశయ్య, చందు, బండారం మధు తదితరులు భాస్కర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు తమ వంతు చేయూత అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు తగు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వండి : సామ రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికలలో బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కార్పొరేటర్లు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని అన్నారు. బిజెపి కార్పొరేటర్‌గా గెలిచాక మాకు పనులవుతున్నాయని కాలనీ వాసులు సంతోషంగా ఉన్నారన్నారు. 8ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం బిజెపి నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందికొండ గీతారెడ్డి, యశ్పల్ గౌడ్, మంచి రాజేష్, కిరణ్‌గౌడ్, గౌరవ్, రాజేందర్, శైలేష్ పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్స్‌కు మరమ్మత్తులు చేపడుతాం: కార్పొరేటర్ అరుణ



మ్యాన్‌హోల్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో ధ్వంసమైనమ్యాన్‌హోల్స్‌కు మరమ్మత్తులు చేపట్టడంతోపాటు అవసరమైన చోట నూతనంగా నిర్మాణం చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కురుమ బస్తీలో మ్యాన్‌హోల్స్ నిర్మాణ పనులు పర్యవేక్షించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని నాలాలు, డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్, రామ్‌సింగ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా అభివృద్ధి పనులు



విద్యుత్ స్థంభాలు పరిశీలిస్తున్న బన్నాల ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్ వెంకటేశ్వర కాలనీలో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలతోపాటు, వైర్లు ఏర్పాటుచేయించారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లోని అన్నిప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ అధికారులతో చర్చించి వెంటనే పనులు చేపట్టేందుకు చర్య లు తీసుకుంటున్నామన్నారు. ఎఇడి శ్రీనివాస్‌తో చర్చించి పనులు వెంటనే చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ఏదుల కొండల్‌రెడ్డి, కార్యదర్శి జగన్, కృష్ణానాయక్, శ్యామ్, సారయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి : శ్రీవాణి



ప్రజా గోస, బిజెపి భరోసా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావ్ తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్‌లో బిజెపి డివిజన్ కార్యదర్శి శక్తి కేంద్రం ఇంచార్జీ నారాయణదాస్ ఆధ్వర్యంలో కామాక్షిపురం చౌరస్తాలో ప్రజా గోస, బిజెపి భరోసా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మోడీ ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, కోఆర్డినేటర్ ఎం.జగదీష్,చింతోజు శ్రీనివాసాచారి, సోమశేఖర్‌గౌడ్, వెంకన్నగౌడ్, రాగి వెంకట్‌రెడ్డి, తుమ్మలి రవి, లింగం, జెట్ట సాయి, లింగం, దుర్గేష్, శ్రీనివాస్, అంజయ్య, సుధాకర్ రెడ్డి, నరసింహా, ఎల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంగూడలో ఘనంగా గణపతి హోమం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం గణపతి హోమం ఘనంగా జరిగింది. సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమానికి హాజరైన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నవారు మల్లారెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.